
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 13 నవంబరు 2024



'పవర్'ఫుల్ గ్రామం

ఆ ఊరు చాలా 'పవర్'ఫుల్. 70 శాతం ఇళ్లల్లో విద్యుత్తు శాఖ ఉద్యోగులున్నారక్కడ. 1956 నుంచీ కాంట్రాక్టు కార్మికులుగా మొదలై.. పర్మినెంట్ ఉద్యోగులయ్యారు. విద్యుత్తు శాఖ విస్తరించే కొద్దీ ఈ గ్రామంలో ఆ శాఖ ఉద్యోగులూ పెరుగుతూ వచ్చారు. ఆ 'పవర్'ఫుల్ గ్రామం గురించి తెలుసుకుందాం..

- 8లో

నవధాన్యాలతో అభిషేకం



బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.43,402 కోట్లు, ప్రకృతి వ్యవసాయానికి రూ.422 కోట్లు.. ఇలా ఎక్కువ నిధులు కేటాయించారంటూ సీఎం చంద్రబాబు చిత్రపటానికి మంగళవారం నవధాన్యాలతో అభిషేకించారు. చంద్రగిరి మండలం దానామూర్తి పల్లెలో ప్రకృతి రైతు కొమ్మినేని దామోదరనాయుడు ఆధ్వర్యంలో రైతులు దయానందనాయుడు, స్వర్ణలత, అన్నపూర్ణ తదితరులు ఈ కార్యక్రమం చేపట్టారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి



అందరూ అతివలే

ఆ ప్రభుత్వ కార్యాలయానికి వెళితే అందరూ మహిళా ఉద్యోగులే కనిపిస్తారు. అధికారి నుంచి అటెండరు వరకూ వాళ్లే. అదే ఎర్రావారిపాలెం మండల పరిషత్ కార్యాలయం. ఇటీవల జరిగిన బదిలీల్లో ఎంపీడీవోగా అరుణ, సీనియర్ సహాయకులుగా బీఎన్ శ్యామల, జూనియర్ సహాయకురాలిగా పుష్పలత, టైపిస్ట్‌గా రమణమ్మ, ఈవోఆర్డీగా మాలతి, హెడ్ క్వార్టర్ పంచాయతీ కార్యదర్శిగా మేనక, అటెండర్‌గా హసీనా ఈ కార్యాలయంలో చేరారు.


- ఎర్రావారిపాలెం, ఆంధ్రజ్యోతి

- ముగిసిన విచారణ.. ప్రభుత్వానికి నివేదిక
- జిల్లావ్యాప్తంగా ఫ్రీ హోల్డ్‌లో 76 వేల ఎకరాలు
- దాదాపు 30 వేల ఎకరాల్లో నిబంధనల ఉల్లంఘన
- మరో నాలుగు రోజుల్లో ముగియనున్న పరిశీలన

మాటల్లేవ్. మాట్లాడుకోవడాల్లేవ్. నిబంధనలు ఖాతరు చేయడాల్లేవ్. అంతా మేం చెప్పినట్లే చేయాలంతే. అలా.. వైసీపీ నేతలు అధికారులపై ఒత్తిళ్లు తెచ్చారు. కొందరు అధికారులూ ఉత్సాహం చూపారు. నిబంధనలకు విరుద్ధంగా చాలావరకు నిషేధిత భూములను ఫ్రీ హోల్డ్ చేయించారు. వీటిలో 702 ఎకరాలను అడ్డగోలుగా రిజిస్ట్రేషన్లు చేసేసుకున్నారు. కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం బయటపడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అడ్డగోలుగా..!



702 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఫ్రీహోల్డ్ భూములపై విచారణ కొనసాగుతోంది. ఫ్రీ హోల్డ్ చేయడంలో.. చేసిన వాటి రిజిస్ట్రేషన్లలో నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. 2003కు ముందు జారీ చేసిన అసైన్‌మెంట్.. డీకేటీ పట్టాలకు చెందిన భూములను మాత్రమే ఫ్రీ హోల్డ్ చేయడానికి జీవో అవకాశం కల్పించింది. జిల్లాలో మాత్రం 2003 తర్వాత జారీ అయిన అసైన్‌మెంట్ పట్టా భూములనూ నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు విచారణ అధికారులు గుర్తించారు. పశువుల మేత పొరంబోకు భూములుగా రికార్డుల్లో నమోదైన వాటిని ఫ్రీ హోల్డ్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ వీటికి కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఇచ్చినా ప్రభుత్వం నుంచి అనుమతి రానిదే ఫ్రీ హోల్డ్ చేయకూడదని నిబంధనలున్నాయి. అలాంటి పశువుల మేత పొరంబోకు భూములనూ ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్టర్ చేసేశారు. ఒకరి పేరిట పట్టా జారీ అయిన భూముల్లో ఇతరులు ఉన్నట్లయితే వాటినీ ఫ్రీ హోల్డ్ చేయకూడదు. ఇలా నిబంధనన్నీ ఉల్లంఘించి 702 ఎకరాలకు రిజిస్టర్ చేశారని పక్కాగా నిర్ధారించారు.

60 వేల ఎకరాల్లో పరిశీలన పూర్తి

జిల్లావ్యాప్తంగా గత వైసీపీ ప్రభుత్వం 76 వేల ఎకరాలను నిషేధిత జాబితా నుంచి ఫ్రీ హోల్డ్ చేసిన క్రమంలో కూటమి ప్రభుత్వం విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇప్పటికి 60 వేల ఎకరాలకు సంబంధించిన రికార్డులతో పాటు క్షేత్రస్థాయి పరిశీలన కూడా పూర్తి చేశారు. ఈ 60 వేలల్లో సుమారు 30 వేల ఎకరాలు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీ హోల్డ్ చేసినట్లు గుర్తించారు. మిగిలిన 16 వేల ఎకరాలపై విచారణ మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. అందులో ఎన్ని ఎకరాల విషయంలో నిబంధనల ఉల్లంఘన జరిగిందో తేలనుంది.

ఆ భూముల విలువ అపారం

జిల్లాలో రిజిస్టర్ అయిన 1761 ఎకరాల్లో వెయ్యి ఎకరాలు కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, ఏర్పేడు, చంద్రగిరి మండలాల్లోనే ఉన్నాయి. ఇక్కడి భూములకు విలువ ఎక్కువ. శ్రీకాళహస్తి మండలంలోని మారుమూల ప్రాంతాల్లోనూ ఎకరా రూ.30 లక్షల దాకా పలుకుతోంది. ఇక ప్రధాన రహదారులకు చేరువగా ఉంటే రూ.కోట్లు పలుకుతోంది. మిగిలిన మూడు మండలాల్లోనూ ఎకరా రూ.కోట్లలోనే ఉంది. పోనీ, ఎకరా రూ.30 లక్షలతోనే లెక్కించినా కూడా అక్రమంగా రిజిస్టర్ అయిన వెయ్యి ఎకరాల విలువ రూ. 300 కోట్లు. వాస్తవ విలువ మేరకు లెక్కిస్తే ఆ మొత్తం రూ. వేల కోట్లకు చేరుతుంది. కూటమి ప్రభుత్వం వీటి రిజిస్ట్రేషన్లను నిలపకుంటే.. అంత భారీ మొత్తాన్ని ప్రభుత్వం నష్టపోయినట్లు అయ్యేది.

ఎన్నికలు సమీపించిన తరుణంలోనే..

నిజానికి నిషేధిత జాబితాలోని భూముల స్వభావం, ఫ్రీ హోల్డ్ చేయడానికి అర్హత ఉందా లేదా అన్నది వీఆర్వో రికార్డులు పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారించి డిప్యూటీ తహసీల్దారుకు ప్రతిపాదించాలి. తన స్థాయిలో డీటీ పరిశీలించి నిర్ధారించుకున్నాక తహసీల్దారుకు నివేదించాలి. ఆయన క్రాస్ చెక్ చేసుకుని ఆర్డీవోకు సిఫారసు చేస్తే.. ఆయన ఆ ఫైలును క్షుణ్ణంగా పరిశీలించి జేసీకి పంపాలి. జేసీ నుంచి అందిన ప్రతిపాదనలపై కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీ చేస్తే గానీ నిషేధిత జాబితా నుంచీ భూములు ఫ్రీ హోల్డ్ కావు. అయితే సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో త్వరగా డీకేటీ, అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేసి రిజిస్టర్ చేసుకోవాలనే తలంపుతో వైసీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. దీంతో చాలావరకూ తహసీల్దారు స్థాయిలోనే భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించినట్టు తెలిసింది. కొంత మేరకు ఆర్డీవోల స్థాయిలో ఈ తంతు నడిచినట్టు సమాచారం. జిల్లాలోని దాదాపు అన్ని మండలాల్లోనూ ఈ ప్రహసనం నడిచింది. దీంతో బాధ్యులపై ప్రభుత్వం కనుక చర్యలకు దిగితే పెద్ద సంఖ్యలో వీఆర్వోలు, డీటీలు, తహసీల్దార్లతో పాటు ఆర్డీవోలపైనా వేటు పడుతుంది. దీంతో చర్యలకు సిఫారసు చేసే విషయంలో ఏమి చేయాలో తోచక జిల్లా యంత్రాంగం సతమతమవుతోంది.

వైసీపీ ప్రభుత్వంలో..

- ఫ్రీ హోల్డ్ చేసింది: 76 వేల ఎకరాలు
- నిబంధనల ఉల్లంఘన: 30 వేల ఎకరాల వరకు..
- మొత్తం రిజిస్ట్రేషన్లు జరిగింది: 1761 ఎకరాలు
- వీటిలో అడ్డగోలుగా చేసింది: 702 ఎకరాలు

8 మందికి కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు

- వన్యకుల క్షత్రియ కార్పొరేషన్‌లో ఏడుగురికి చోటు
- ఆర్యవైశ్య కార్పొరేషన్‌లో ఒకరికి స్థానం



సెల్వం



మునిరత్నం రెడ్డి



చిన్నారెడ్డి



తేజోవతి



మిన్నల రవి



బద్రీనారాయణ

తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మంగళవారం ప్రకటించిన నామినేటెడ్ పదవుల జాబితాలో జిల్లా నుంచి ఎనిమిది మందికి చోటు దక్కింది. వన్యకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్‌లో మొత్తం 15 మంది డైరెక్టర్లూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులే కావడం విశేషం. అందులో ఏడుగురు తిరుపతి జిల్లా నుంచి నియమితులయ్యారు. ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్‌లో ఒకరికి స్థానం లభించింది. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు టీడీపీ.. జనసేన, బీజేపీ నుంచి ఒక్కోనేత ఉన్నారు. వన్యకుల క్షత్రియ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన వారిలో తిరుపతికి చెందిన బాలసుబ్రహ్మణ్యం (జనసేన), జీపాలెం తేజోవతి (బీజేపీ), శ్రీకాళహస్తికి చెందిన చెర్లోపల్లె సుబ్రమణ్యం, పి.చిన్నారెడ్డి, మినరల్ రవి (టీడీపీ).. సూళ్లూరుపేటకు చెందిన కోళవి సెల్వం, చంద్రగిరికి చెందిన పి.మునిరత్నంరెడ్డి (టీడీపీ) ఉన్నారు. అలాగే ఆర్యవైశ్య అభివృద్ధి కార్పొరేషన్‌లో చంద్రగిరికి చెందిన వి.ఎస్.బద్రీ నారాయణ (టీడీపీ) డైరెక్టరుగా అవకాశం దక్కించుకున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి జిల్లాలో మోస్తరు వర్షం కురిసింది. మంగళవారమూ అడపాదడపా కురుస్తూనే ఉంది. దీంతో వాతావరణం చల్లబడింది. కోటలో 108మి.మీ., వాకాడు 80.2, దొరవారిసత్రం 49.8, సూళ్లూరుపేట, చిట్టమూరు 46.4, చిల్లకూరు 34.4, గూడూరు 31.4, నాయుడుపేట 28.2,, ఓజిలి 27.4, బాలయపల్లి 19.8, బుచ్చినాయుడుకండ్రిగ 19.6, వరదయ్యపాళెం 19.4, పెళ్లకూరు 14.4, వెంకటగిరి 12.2, తడ 104మి.మీ. వర్షపాతం నమోదైంది.

ఇక పోలీసు వద్దా ఆధార్

- నేర పరిశోధనలో మరింత వేగం

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పోలీసు శాఖకు ఆధార్ అనుసంధానం కానుంది. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ఈ దిశగా చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు నేరస్థులు, అసాంఘిక శక్తుల వేలి ముద్రలు, కనుబొమ్మలు మాత్రమే పోలీసు శాఖ వద్ద అందుబాటులో ఉన్నాయి. వీటివల్ల నేరపరిశోధనలో అనుకున్న స్థాయిలో ఫలితాలు రాకపోవడంతో ఇకపై ఆధార్ కార్డులను పోలీసు శాఖకు అనుసంధానం చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లాలోని ప్రతి ఒక్కరి ఆధార్ కార్డును పోలీసు శాఖకు అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు ఆధార్ డేటాను పర్యవేక్షించే యూనిక్ ఐడెంటిఫికేషన్ యాప్‌ను అందుబాటులోకి తేనుంది. దీంతో పాటు ప్రభుత్వంపైన, ప్రభుత్వ పెద్దలపైన సోషల్ మీడియాను వేదికగా చేసుకుని విమర్శలు, ఆరోపణలు చేస్తున్న వారిని ఆధార్ నెంబరు ఆధారంగా గుర్తించే వీలుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రాథమికంగా తొలి దశలో దాదాపు లక్ష నుంచి రెండు లక్షల మంది ఆధార్ కార్డులు పోలీసు యూనిక్ ఐడీతో అనుసంధానం చేసి తద్వారా వచ్చే ఫలితాలను బట్టి మిగిలిన వారి ఆధార్‌ను పోలీసు శాఖకు అనుసంధానం చేయనున్నారు. దీనివల్ల నేర పరిశోధనలో పోలీసులకు మరింత వెసులుబాటు లభించనుంది.

బాలింతలకు ప్రత్యేక గది

- వారం రోజుల్లో మరో గది ఏర్పాటుకు సన్నాహాలు

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రుయా చిన్నపిల్లల విభాగంలో చికిత్స పొందుతున్న నవజాత శిశువుల కోసం ఆస్పత్రిలో ఉంటున్న బాలింతలకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. చికిత్స పొందుతున్న 'చంటి బిడ్డల కోసం' వార్డుల ముందు అవస్థలు పడుతున్న బాలింతల విషయంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఏపీఎంఐసీడీసీ అధికారులతో కలిసి మంగళవారం బాలింతలు ఉంటున్న ఆవరణాన్ని పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో తల్లుల కోసం ఏర్పాటు చేసిన రెండు విశాలమైన గదులను కొవిడ్ తర్వాత వ్యాక్సిన్ కోసం ఉపయోగిస్తున్నామన్నారు. తిరిగి వాటిని తల్లులు ఉండేందుకు అనుకూలంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతానికి అందులో ఒక గదిని సిద్ధం చేశామన్నారు. వారంలో మరో గదిని కూడా అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ప్రస్తుతం బాలింతలు ఉంటున్న వరండాల్లో దోమల బెడద, ఉక్కపోతల సమస్యలు లేకుండా ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



ఖాళీ గదులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రవిప్రభు

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టండి


'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయ అధికారి,రైతులు

భాకరాపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి ధనలక్ష్మి సూచించారు. చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారి పల్లె పంచాయతీ జంగావాండ్ల పల్లెలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అలసంద, కంది, ఉలవ, పెసరు, మినుములు వంటి ప్రత్యామ్నాయ పంటలు వేయడం వల్ల పంట దిగుబడితోపాటు పశుగ్రాసంగ ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు ధ్వజారోహణం


మూషిక వాహనంపై గణనాథుడు

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తొండవాడ లోని అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు మంగళవారం వైభవంగా ధ్వజారోహణం జరిగింది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు కలశ స్థాపన, మండపారాధన, గణపతి హోమం, ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి 7 గంటలకు వినాయక స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మూషిక వాహనంపై ఊరేగించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.82 కోట్లు

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.82 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 73,917 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,161 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


ఏక్తా కపూర్- దీప్తిసునైనా, మెహబూబ్, అలేఖ్య

తిరుమల, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సినీ హీరో మంచు విష్ణు, నిర్మాత ఏక్తాకపూర్, బిగ్‌బాస్ కంటెస్టెంట్లు దీప్తిసునైనా, మెహబూబ్, అలేఖ్య హారిక ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం మంచు విష్ణు ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 'కన్నప్ప' సినిమా గురించి శ్రీవారిని ప్రార్థించానని తెలిపారు. ఈ చిత్రం డిసెంబరులో విడుదల చేయాలనుకున్నా కొన్ని కారణాలతో వచ్చే వేసవికి మార్చామన్నారు. త్వరలోనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

● రూ.23 వేల జరిమానా

చిల్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి చిరిపి రెడ్డి సుమ మంగళవారం తీర్పునిచ్చారు. 2021లో చిల్లకూరు మండలంలోని ఓ బాలిక బహిర్భూమికి వెళ్లగా.. మస్తాన్‌బాబు బలాత్కరించాడు. ఇతడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నెల్లూరులోని పోక్సో కోర్టులో విచారణ జరిగింది. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ. 23వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

తెప్పపై అండాల్ అమ్మవారి దివ్యదర్శనం



నారాయణవనం, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పద్మ సరస్సులో తెప్పపై అండాల్ (గోదాదేవి) అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాత సేవ సహా నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం గోదాదేవికి స్నపన తిరుమంజనం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం అర్చకులు అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలతో అండాల్‌గా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప జేసి మేళ తాళాలు, కోలాటాల మధ్య వేంచేపుగా పద్మసరస్సుకు చేరుకున్నారు. అనంతరం తెప్పపై అధిష్టింపజేసి పద్మ సరస్సులో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం, ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్ర మాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈవో మోహన్, ఆలయాధికారులు నాగరాజు, భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున, ఏఈలు గురుప్రసాద్, నందిబాబు పర్యవేక్షించారు.

ఇరకం విద్యార్థుల పడవలకు ఇంజన్ల వితరణ

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇరకం విద్యార్థులు ప్రయాణించే పడ వలకు అవసర మైన ఇంజన్లను ఓ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందజేసింది. ఇరకం గ్రామస్థులు కొద్ది రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలుసుకొని పడవల విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ మత్స్యశాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. మత్స్యశాఖ డీఈ నాగరాజు, ఓ స్వచ్ఛంద సంస్థకు తెలియజేసి రెండు పడవలకు నాలుగు మోటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంగళవారం సుమారు రూ.1.57 లక్షల వ్యయంతో నాలుగు మోటర్లను ఇరకం గ్రామస్థులకు అందజేశారు.

తీర్థంపాడు వీఆర్వో సస్పెన్షన్

డక్కిలి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం తీర్థంపాడు వీఆర్వో కోటిరెడ్డిని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేశారు. మంగళవారం ఉత్తర్వులు అందినట్లు తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. వీఆర్వోగా కోటిరెడ్డి తన పరిధిలో లేని పలుడుగోడు గ్రామంలో ఓ భూమికి సంబంధించి శిస్తు కట్టించుకొని రసీదులు, అడంగళ్, ఎంజాయ్‌మెంట్ పత్రం ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. తహసీల్దారు విచారించడతంఓ కోటిరెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది.

మూడు చోట్ల పిడుగులు

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మూడు చోట్ల మంగళవారం తెల్లవారుజామున పిడుగులు పడ్డాయి. సోమ వారం రాత్రి 12 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజామున 2 గంటల వరకు భారీ వర్షం కురిసింది. వంజివాకలోని ఓ ఇంటి ఆవ రణలో ఉన్న కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. అలాగే ఉచ్చూరు వారిపాళెంలో ఓ ఇంటి మేడ మెట్లపై పిడుగుపడటంతో పెచ్చులూడి పోయింది. శ్యామసుందరపురంలో రెండంతస్తుల మేడపై ఉన్న ప్లాస్టిక్ నీళ్ల ట్యాంక్‌పై పిడుగుపడటంతో ఆ ట్యాంక్ రెండుగా చీలిపోయింది.

ఎన్‌బీకేఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉత్తర కొరియాకు చెందిన బహుళ జాతి సంస్థ స్నోవాసిస్ మంగళవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించింది. ఇంజనీరింగ్ ఆఖరి సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ ఎలక్ట్రికల్, మెకానికల్ విభాగాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ ప్రతినిధులు కిషోర్, రాజేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 119మంది రెండో రౌండ్‌కు అర్హత సాధించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.82 కోట్లు

తిరుమల, నవంబరు12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.82 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 73,917 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,161 మంది తలనీలాలు సమర్పించారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

●భార్యకు గాయాలు


మృతి చెందిన మధు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తాటితోపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్య తీవ్రంగా గాయపడింది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు...ఐరాల మండలం నెల్లిమందకు చెందిన మధు తిరుపతిలో మేస్త్రీగా పనిచేస్తున్నాడు. జీవకోనలో ఉంటున్న ఇతనికి భార్య, కుమారుడు..ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య గాయత్రితో కలిసి మంగళవారం బైక్ మీద స్వగ్రామం వెళ్తున్నాడు. ఈక్రమంలో తిరుపతి చెర్లోపల్లి రోడ్డులో ప్రయివేటు ఆసుపత్రి సమీపంలో ఆగి ఉన్న పాల వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో మధు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను రుయాకు తరలించారు. పాలవ్యాన్ డ్రైవర్ బాలరంగడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు,రేపు పడిపూజ మహోత్సవం

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐతేపల్లె వద్ద సుందరగిరి అయ్యస్వామి ఆలయంలో బుధవారం, గురువారాల్లో పడిపూజ మహోత్సవాలు నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ఆలయశుద్ధి తరువాత అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు ధ్వజారోహణం దుర్గాపూజ జరుగుతుంది. గురువారం ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకూ వివిధ పూజలు నిర్వహించనున్నారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

పెళ్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయతోపు గ్రామంలో బెల్టు షాపుపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మురళీని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 8 బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

ఆరంభ ముచ్చటేనా ఆ వెలుగు జిలుగులు!

●కోటపై నిలిచిన సౌండ్ అండ్ లైటింగ్ షో ●పురావస్తుశాఖతో ఒప్పందం కోసం నిరీక్షణ


చంద్రగిరి కోటలో సౌండ్ అండ్ లైటింగ్ షో (ఫైల్ ఫొటో)

చంద్రగిరి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోటలో సౌండ్ అండ్ లైట్ షో ఆరంభ మచ్చటేనా అని సందర్శకులు పెదవి విరుస్తున్నారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ పబ్లిక్ ప్రవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) పద్ధతి కింద లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ప్రపంచ పర్యాటక దినోత్సవం నాడు(సెప్టెంబరు 27న) కోటలో ఈ షోను ప్రారంభించింది. పూర్వ వైభవం వచ్చిందని అందరూ ఆనందపడ్డారు. కానీ ఆనందం ఆ ఒక్క రోజుకే పరిమితమైంది. 40 రోజులవుతున్నా షో మళ్లీ ప్రదర్శించడలేదు. సందర్శకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. 2000లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పురావస్తు శాఖతో సంప్రదించి ఏపీ టూరిజంశాఖ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో కోటలో లైటింగ్ షో ఏర్పాటు చేయించారు. రాష్ట్ర విభజన తరువాత టీడీపీ ప్రభుత్వం రూ.3.50 కోట్లతో చెన్నైకు చెందిన లక్స్ అండ్ డిజబుల్ సంస్థ ద్వారా లైటింగ్ షోకు అత్యాధునిక హంగులద్దించింది. 2018 జూలైలో కోట గోపురంపై పిడుగు పడటంతో లైటింగ్ షో సాంకేతిక లోపాలతో నిలిచిపోయింది. పది నెలల క్రితం ఎన్నికల ముందు నాటి వైసీపీ ప్రభుత్వం ఏపీ టూరిజం కార్పొరేషన్ పీపీపీ విధానంలో లక్స్ అండ్ డెసిబిల్స్ సంస్థ ద్వారా మరమ్మతులు చేయించింది. ఈ ఏడాది సెప్టెంబరు 27న ఎట్టకేలకు సౌండ్ అండ్ లైట్ షో తిరిగి ప్రారంభమైంది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో షో జరిగేది. ఇప్పుడు ప్రయివేటు సంస్థకు షో నిర్వహణ అప్పగించారు. పీపీపీపై షో నిర్వహిస్తున్న నేపథ్యంలో చారిత్రాత్మక కట్టడం భద్రతకు సంబంధించి పురావస్తుశాఖతో ఒప్పందం చేసుకోవల్సి ఉంది. ఒప్పందం చేయనందున షో నిలిచిపోయిందని సమాచారం. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఈ శాఖతో చర్చించి సౌండ్ అండ్ లైట్ షో ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టమోటా దిగుబడికి సమగ్ర సస్యరక్షణ చర్యలు


సోది ఈగ వలన మారిన టమోటా ఆకులు

భాకరాపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): టమోటా సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యాన శాఖాధికారి శివకుమారి తెలిపారు. వర్షాకాలంలో ఈ పంటను ఊజి ఈగ, సూది పురుగు ఆశించడం వల్ల 60 శాతం నుంచి 70 శాతం వరకు నష్టం జరుగుతుందన్నారు. తల్లి పురుగులు రాత్రి వేళల్లో పంటపై దాడి చేసి నష్టాన్ని కలుగజేస్తాయన్నారు. ఆకు అడుగు భాగాన గుడ్డు పెడతాయన్నారు. పిల్ల పురుగులు ఆకుల మధ్య పొరల్లోకి సూది లాంటి రంధ్రాలు చేసి పత్రహరితాన్ని తిని, బయటకు వచ్చి విసర్జించడం వల్ల ఆకుల మీద పాము పొరలా కనిపిస్తుందన్నారు. సూది పురుగు ఆకులు, కొమ్మలు, కాయలకు నష్టం చేస్తాయమన్నారు. పురుగులు కాయ పైభాగంలో సూది మొన లాంటి రంధ్రాలు చేసి చొరబడి లోపల కణజాలాన్ని తిని విసర్జిస్తాయన్నారు. ఈ లార్వా ఆకుల పైభాగాన, భూమిలో ప్యూపా దశకు చేరాక రెక్కల పురుగులుగా బయటకు వస్తాయన్నారు.

ఈ చర్యలతో మేలు

● వేసవిలో లోతైన దుక్కులు దునుకుంటూ భూమిలో ప్యూపాలను నియంత్రించవచ్చు.

● పంట చుట్టూ జొన్న, సజ్జ, మొక్కజొన్న వంటి కంచె పంటలు వేసుకోవాలి.

● ఎకరాకు పది చొప్పున లింగాకర్షన బుట్టలను అమర్చుకోవాలి. 15 నుంచి 20 వరకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చాలి.

● పంట తెగులు దశ నుంచి లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె కలిపి పిచికారి చేయాలి. ఫిప్రోనిల్ 3 మి.లీ. లేదా బెండామైడ్ 3 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

అపార్‌కు ఆధార్ కష్టాలు

భాకరాపేట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో ప్రతి విద్యార్థికీ 12 అంకెలతో విశిష్ట గుర్తింపు కార్డు ఇవ్వాలని నిర్ణయించిన నేపథ్యంలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 'అపార్' (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు ఆధార్‌కార్డుకు స్కూల్ సర్టిఫికెట్‌లోని వివరాలు సరిపోలి ఉండాలన్నేది ప్రభుత్వ ఉద్దేశం. అయితే గతంలో ఆధార్ కార్డుల్లో పేర్లు, పుట్టిన తేదీలు, ఊర్ల పేర్లు చాలావరకు తప్పులుగా నమోదు చేశారు. దీంతో అపార్‌కు ఆధార్‌కు కొన్ని సరిపోలడంలేదు. దీంతో ఈ తప్పులు సరిచేసుకోవడానికి విద్యార్థులు ప్రస్తుతం ఆధార్ కేంద్రాల వద్దకు పరుగులు తీస్తున్నారు. గతంలో చిన్నగొట్టిగల్లు, భాకరపేట సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల నిర్వహణ కొంతకాలం బాగానే ఉంది. గతేడాది డేటా ఇక్కడి డేటా ఎంట్రీ ఆపరేటర్లు బదిలీపై ఇతర సచివాలయాలకు వెళ్లిపోయారు. అప్పటి నుంచి ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదు. మండలంలో మూడు జడ్పీ ఉన్నత పాఠశాలలు, 37 మండల పరిషత్ పాఠశాలలు, నాలుగు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 3050 మంది చదువుతున్నారు. వీరిలో చాలా మందికి ఆధార్ కార్డులు తప్పుడు ఉండడంతో సరిచేసుకోవడానికి ఎర్రావారిపాళెం, పీలేరు, రొంపిచెర్ల ప్రాంతాలకు వెళుతున్నారు. ఆధార్ కేంద్రాలు మళ్లీ పనిచేసేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ముక్కంటి ఆలయబోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించండి



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించాలని బొడుగు ముని రాజాయాదవ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అమరావతిలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం ధనంజయులునాయుడు, కందాటి శివ శంకర్ రెడ్డి, రంగినేని చెంచయ్యనాయుడు, పాపిరెడ్డి, కన్నలి మోహన్‌రెడ్డి, కేశినేని సుబ్రహ్మణ్యం, దేవినాయుడు, జగదీష్‌నాయుడు, ఉమాపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ భూముల ఆక్రమణ చట్టరీత్యా నేరం

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అటవీ భూములు ఆక్రమించుకోవడం చట్టరీత్యా నేరమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. కళత్తూరు రైతులు అటవీ భూముల్లో వ్యవసాయం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. గతంలో రెవెన్యూ భూముల్లో వ్యవసాయం చేసుకునే వారికి డీకేటీ పట్టాలు ఇచ్చారని తెలిపారు. కళత్తూరు గ్రామ రైతులు అటవీ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల్లో పంటలు వేశారని తమ దృష్టికి వచ్చిందన్నారు. వారు నష్టపోకూడదనే ఉద్దేశంతో వేసిన పంట సాగుకు మాత్రమే అనుమతిస్తున్నట్లు తెలిపారు. తాము 30 ఏళ్లుగా ఆ భూముల్లో వ్యవసాయం చేస్తున్నామని రైతులు తెలపగా రుజువులు చూపిస్తే పరిశీలిస్తామని చెప్పారు.

సోలార్ వినియోగంపై అవగాహన

సోలార్ ఉత్పత్తి, వినియోగంపై గ్రామీణులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళశారం కలెక్టరేట్‌లో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగంపై ఆయన అధికారులతో సమీక్షించారు. సోలార్ వినియోగం వల్ల కాలుష్య రహిత, పర్యావరణ హిత సమాజం ఏర్పడుతుందన్నారు. సౌర విద్యుత్‌ను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంకుపెట్టిన వారికి నోటీసులిస్తాం

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా రాత్రికి రాత్రి ఆర్అండ్ బీ రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో బంకు పెట్టిన వారికి నోటీసులు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి మణి చెప్పారు. బంకును ఏర్పాటుపై ఆంధ్రజ్యోతి దినపత్రిలో ఇటీవల వార్త ప్రచురించమైంది. స్పందించిన పంచా యతీ కార్యదర్శి మంగళవారం రేణిగుంట - తిరుపతి ప్రధాన రోడ్డు మార్గంలోని రైల్వే ఆస్పత్రి ఎదురుగా బంకును పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి బంకును ఇక్కడి నుంచి తొలగిస్తామన్నారు.

రికార్డులు స్వాధీనపరచని కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

● రేణిగుంట పంచాయతీలో నిధుల అవకతవకలపై త్రీమెన్ కమిటీ: డీపీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అధికారులను నిలదీస్తున్న డీపీవో సుశీలాదేవి

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మేజర్ పంచాయతీలో నిధులు అవకతవకలపై డీఎల్‌పీవో ఆధ్వర్యంలో విచారణ జరిపి నివేదిక అందించడంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన డీపీవో ఎట్టకేలకు త్రీమెన్ కమిటీని నియమించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'తేలని లెక్క రూ.6కోట్లు - ఇంకా బాధ్యతలు అప్పగించని బదిలీ కార్యదర్శులు' అనే కథనానికి జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి స్పందించారు. మంగళవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పంచాయతీలో పారిశుధ్య పనుల లోపంపై ఈవోపీఆర్డీ ప్రభురావు, కార్యదర్శి మణి, ఇన్‌స్పెక్టర్ రవిపై మండిపడ్డారు. అనంతరం డీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ.. ఇక్కడి నుంచి బదిలీ అయి, ఇప్పటి వరకు రికార్డులు అందజేయని ఆరుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు పంపిస్తున్నామన్నారు. గతంలో సుబ్బరాజు బోరు, 2022లో పంచాయతీలో జరిగిన నిధులు అవకతవకలపై డీఎల్‌పీవో ప్రభురెడ్డిని విచారణ అధికారిగా వేసినా నివేదికలు అందించడంలో జాప్యం జరుగుతుండటంతో త్రీమెన్ కమిటీని నియమించినట్టు తెలిపారు. త్రీమెన్ కమిటీ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడమే కాకుండా ఆయా పంచాయతీల్లో సర్పంచుల చెక్ పవర్ రద్దయ్యే అవకాశం ఉంది.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలోని దక్షిణ కాళికాదేవి ఆలయంలో మంగళవారం మ ధ్యాహ్నం రాహుకాల సమ యంలో మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అ నంతరం సుందరంగా అలం క రించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థప్రసాద వినియోగంతో పాటూ మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్ విజేతలు శ్రీకాకుళం, బాపట్ల జట్లు



తిరుపతిరూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు క్రీడాపోటీలు రెండవ రోజైన మంగళవారం రసవత్తరంగా సాగాయి. వాలీబాల్‌లో తాడిపత్రి కళాశాల జట్టుపై శ్రీకాకుళం వ్యవసాయ కాలేజీ జట్టు విజేతగా నిలిచింది. బాల్‌బ్యాడ్మింటన్‌లో మార్కాపురానికి చెందిన ఎస్ఎస్ అగ్రికల్చరల్ కళాశాల జట్టుపై బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు విజేతగా నిలచింది. క్యారమ్స్, చెస్ విభాగాల్లో బాపట్ల వ్యవసాయ కళాశాల జట్టు విజేతలుగా నిలచాయని ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రవికాంత్‌రెడ్డి వెల్లడించారు. బుధవారంతో మొదటి దశ పోటీలు ముగుస్తాయని అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ పేర్కొన్నారు.

ఆంజనేయ స్వామికి పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయంలోని పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయుడికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్ర వ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిందూరం దిద్దారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో కాలభైరవుడికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. అర్చకులు కాలభైరవుడికి అభిషేకాలు నిర్వహించారు.



చిరుజల్లుల వేళ హిమ సొగసులు

తిరుమలను మంగళవారం వేకువజాము నుంచే చిరుజల్లులు పట్టుకున్నాయి. రాత్రి వరకు పలు దఫాల్లో చినుకులు పడుతూనే ఉన్నాయి. చిన్నపాటి చినుకులే కావడంతో శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితో పాటు వెలుపలకు వచ్చిన భక్తులు జల్లుల్లో తడిశారు. చలితీవ్రత కూడా భారీగా పెరిగింది. ఇదే సమయంలో తిరుమలగిరులను దట్టమైన పొగమంచు కప్పేసిన దృశ్యాలు భక్తుల మనసుదోచాయి. శేషాచలకొండలపై వాలుతూ.. వర్షం పడే సమయంలో మాయమవుతూ ప్రకృతిప్రియులను ఆకట్టుకున్నాయి. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులు ఘాట్‌రోడ్డులో ఈదృశ్యాలను వాహనాలను ఆపి ఆసక్తిగా తిలకించారు.

-తిరుమల,ఆంధ్రజ్యోతి

13మంది ఎర్రస్మగ్లర్ల అరెస్టు

● రంపాలు, గొడ్డళ్లు, రెండు ఆటోలు, మోటారు సైకిల్ స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా కల్లూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో 13మంది ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గొడ్డళ్లు, రంపాలు, రెండు ఆటోలు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు డీఎస్పీ బాలిరెడ్డి మంగళవారం కపిల తీర్థం వద్దగల టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో స్మగ్లర్ల అరెస్టు చూపారు. ఆర్‌ఎస్‌ఐలు లింగాధర్, విశ్వనాథ్, అటవీ శాఖ ఎఫ్‌బీవో శ్రీదేవిల బృందం సోమవారం చిత్తూరు జిల్లా ఐరాల అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు ఆటోలలో వచ్చిన కొంతమంది అటవీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించారు. వారిని చుట్టుముట్టడంతో కొందరు పారిపోగా 13 మంది దొరికారు. వారి నుంచి నాలుగు గొడ్డళ్లు, బరిస, రంపు చుట్టలు స్వాధీనం చేసుకున్నారు. వారిలో 10మంది తమిళనాడు తిరువన్నామలై జిల్లాకు చెందిన వారు కాగా మరొకరు కల్లకరుచ్చి జిల్లాకు చెందిన వారు. మరో ఇద్దరు చిత్తూరు నగరానికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పాన చెరువులో ఆక్రమణలకు చెక్





● రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారుల జాయింట్ సర్వే
● త్వరలో బౌండరీ ఏర్పాటు

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాల ఫొటోలు

చెరువు ఆక్రమణలో భాగంగా గతంలో తోలిన రాళ్లు

తిరుపతి (జీవకోన), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని అన్నమయ్య మార్గం(హోటల్ గెస్ట్‌లైన్ డేస్ సమీపం)లో ఉన్న పాన చెరువు (పాత చిన్న చెరువు)లో ఆక్రమణలకు చెక్ పడనుంది. తిమ్మినాయుడుపాళెం లెక్క దాఖల సర్వే నెంబరు 84లో పాన చెరువు 49.40 ఎకరాల్లో విస్తరించి ఉంది. నగరం విస్తరించడంతో తిరుపతి నడిబొడ్డున ఉన్న ఈ చెరువు కింద ఆయకట్టు భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. రియల్ వ్యాపారులు ప్రవేశించి చాలావరకు ప్లాట్లుగా మార్చేశారు. గత ప్రభుత్వంలో యథేచ్ఛగా ఆక్రమణలు సాగాయి. వీటికి అడ్డుకట్ట వేసేలా అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఐదు నెలల క్రితం సర్వే చేసేందుకు ఇరిగేషన్ అధికారులు అర్బన్ తహసీల్దారు కార్యాలయాన్ని సంప్రదించారు. ఆ సమయంలో ఎన్నికల కోడ్ ఉండడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వం మారడంతో మంగళవారం అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మి సూచనల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించారు.

చెరువు విస్తరించి ఉన్న పూర్తి హద్దులను చూపించారు. సర్వేలో ఇరిగేషన్ ఏఈ అనిత, అర్బన్ రెవెన్యూ మండల సర్వేయర్ జగదీష్, మున్సిపల్ కార్పొరేషన్ సర్వేయర్ కోటేశ్వరరావు, వీఆర్వోలు వెంకటాచలం, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో ఆక్రమణకు విఫలయత్నం

పాన చెరువు చుట్టూ ఉన్న భూమిని ఆక్రమించుకునేందుకు గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. చెరువు భూమిని చదును చేసి, నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఎప్పటికప్పుడు కథనాలు రావడం, అధికారులు స్పందించి అడ్డుకోవడం జరిగింది. హెచ్చరికలు సైతం జారీ చేసినా వారి ప్రయత్నాలు మానలేదు. తెలుగుదేశం పార్టీ నాయకులు సైతం నిరసన తెలియజేశారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆధ్వర్యంలో నాయకులంతా హాజరై చదును చేసిన భూమిని పరిశీలించి అన్యాక్రాంతం కాకుండా చూడాలని అధికారులను కోరారు. ప్రస్తుతం జాయింట్ సర్వేతో పాటు సరిహద్దు ఏర్పాటు చేయనుండడంతో ఆక్రమణదారులకు చెక్ పడినట్లే.





చెరువు వద్ద సర్వే నిర్వహిస్తున్న అధికారులు - మట్టి తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు (ఫైల్ ఫొటో)

హద్దు ఏర్పాటు చేస్తాం

పాన చెరువు చుట్టూ త్వరలో బౌండరీ ఏర్పాటు చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాయింట్ సర్వే చేపట్టాం. భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా మున్సిపల్ శాఖ సహకారంతో బౌండరీ ఏర్పాటు చేస్తాం.

- అనిత, ఇరిగేషన్ ఏఈ

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

పాన చెరువు వద్ద ఆక్రమణలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఆక్రమణలకు ఆస్కారం లేకుండా సర్వే నిర్వహించి, హద్దులను ఇరిగేషన్ అధికారులకు చూపించాం. ఆ హద్దుల ఆధారంగా ఇరిగేషన్ శాఖ బౌండరీలు ఏర్పాటు చేస్తుంది.

- భాగ్యలక్ష్మి, అర్బన్ తహసీల్దారు

15న చంద్రమౌళీశ్వర పూజ

తిరుపతి(లీలామహల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కోదండరామాలయ ఉత్తర మాడ వీధిలోని శృంగేరి మఠంలో ఈనెల 15వ తేదీ రాత్రి 8 గంటలకు చంద్రమౌళీశ్వర పూజ నిర్వహించనున్నట్లు మఠం ధర్మాధికారి రాళ్లపల్లి రామమూర్తి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం చేపట్టనున్న ఈ కార్యక్రమానికి విధుశేఖర భారతి మహాస్వామి హాజరుకానున్నారని, రుద్రాభిషేకం, విష్ణుచక్ర అర్చన, మంచినీళ్ల గుంట శివాలయంలో అన్నాభిషేకం, ప్రత్యేక పూజలతోపాటు స్వామి వారి అనుగ్రహభాషణం చేస్తారని పేర్కొన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కలెక్టర్‌ను కలిసిన శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ముక్కంటి తీర్థప్రసాదాలు, మొక్క అందించారు.

17న జిల్లాస్థాయి అండర్ 13 చెస్ పోటీలు

తిరుపతి(క్రీడలు), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్.ఎ. సాగరం రాయ్ చెస్ అకాడమీలో ఈ నెల 17న జిల్లాస్థాయి అండర్ 13చెస్ ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి హెచ్.శ్రీనివాససూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచిన బాలబాలికలు 2011 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని పేర్కొన్నారు. జనన ధృవీకరణ పత్రం కలిగి ఉండాలని తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 9885238474ను సంప్రదించాలని కోరారు. మొదటి రెండు స్థానాల్లో ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి అండర్ 13 చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు పంపుతామని తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళను తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అతని నుంచి 12 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ కవీశ్వర నాయుడు, సిబ్బంది కలసి రేణిగుంట-శ్రీకాళహస్తి జాతీయ రహదారిలోని గుత్తివారిపల్లి వద్ద మద్యం విక్రయిస్తున్న రేణిగుంట మండలం ఆర్.మల్లవరం గ్రామానికి చెందిన పి.మునిరత్నమ్మను అరెస్టు చేశారు.

కల్యాణకట్ట క్షురకుల సమస్యల పరిష్కారానికి కృషి



తిరుపతి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తిరుమల కల్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమాభివృద్ధి ఛైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఎన్నికైన సందర్భంగా మంగళవారం చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని ఆయన నివాసంలో కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ నాయకులు, టీటీడీ ఉద్యోగులు రుద్రకోటిని ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ తనపై బృహత్తర బాధ్యత పెట్టిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువనేత నారా లోకేశ్ నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సన్మానించిన వారిలో కల్యాణకట్ట నాయీ బ్రాహ్మణ నాయకులు పంతులుగారి రామనాథం, ఆవుల పాటి సంజీవి, పెరుమాళ్, పవన్, చిన్ని, ఆర్.మునీంద్ర, పీఎం మురుగన్, శివాజీ, కేశవ, శ్రీనివాసులు, బాలకృష్ణ, కన్నయ్య, వెంకటేశ్వర్లు, భాను, చిట్టి, మునికుమార్, రాజేంద్రలు ఉన్నారు. టీటీడీ ఉద్యోగుల బ్యాంక్ డైరెక్టర్ చీర్ల కిరణ్ శాలువా కప్పి సన్మానించారు.

రూ.లక్షతో టీడీపీ శాశ్వత సభ్యత్వం



సభ్యత్వం తీసుకుంటున్న మందలపు మోహన్

తిరుపతి, నవంబరు12(ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత మందలపు మోహన్‌రావు లక్ష రూపాయలు చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం పొందారు. తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మంగళవారం మందలపు ఇంటికి వెళ్లి సభ్యత్వ కార్డును అందజేశారు. శాశ్వత సభ్యత్వం తీసుకునేందుకు ఇప్పటికే చాలామంది ముందుకొచ్చారని ఈ సందర్భంగా ఆమె చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిశేఖర్ రాయల్, నారాయణ, రాజారాం, మునిచంద్రలు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.27లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

తిరుపతి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొంకావీధిలోని షిరిడి సాయి బాబా ఆలయానికి హుండీ ద్వారా రూ.4,27,660 ఆదాయం లభించింది. సాయిబాబా సేవా సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది మంగళవారం హుండీ కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో సాయిబాబా సేవాసమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, దుర్గం శ్రీనివాస్, ఎం.శివ, సి.రమేష్, పి.విజయలక్ష్మి, హరిబాబు, శీను, కె.ప్రభాకర్, పి.రాజామణి పాల్గొన్నారు.

అసెంబ్లీకి జగన్ డుమ్మా అప్రజాస్వామికం

తిరుపతి (జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్.జగన్ అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకపోవడం అప్రజాస్వామికమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అసెంబ్లీకి వెళ్లకపోవడం అంటే ప్రజల తీర్పును కించపరచడమేనని పేర్కొన్నారు. అసెంబ్లీకి హాజరై అధికార పక్షానికి సూచనలు, సలహాలు ఇవ్వాల్సింది పోయి ప్రతిపక్ష నాయకుడి హోదా సాకుతో బహిష్కరించడం హేయమైన చర్యగా అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్య, వైద్యం, యువతకు ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. అసెంబ్లీకి హాజరుకాని సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేయాలని స్పీకర్‌కు లేఖ రాస్తున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్ డివిజన్ పరిధిలోని తిరుచానూరు సెక్షన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఈఈ వి.చంద్రశేఖరరావు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుచానూరు టౌన్, తోళప్పగార్డన్, యోగిమల్లవరం, సన్నిధి వీధి, వసుంధరానగర్, వైష్ణవినగర్, శంకర్ నాయుడు కాలనీల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

18న టీటీడీ కార్తీక దీపోత్సవం

తిరుపతి(కల్చరల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 18వ తేదీ తిరుపతిలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు టీటీడీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం మైదానంలో దీపోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

ఆమోదయోగ్యమైన బడ్జెట్

విద్య, వైద్యం, రైతులకు, మహిళలకు పెద్దపీట : బీజేపీ



మీడియాతో మాట్లాడుతున్న శ్రీనివాస్

తిరుపతి (లీలామహల్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీలో కూటమి ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్ సంక్షేమ, అభివృద్ధితో పాటూ అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి గాలేరు - నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు రూ.4,500 కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాయలసీమను కరువు ప్రాంతంగా చెబుతూ గత ప్రభుత్వం ప్రాజెక్టులకు కేటాయించిన నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. గత ప్రభుత్వంలో విద్యా రంగంలో అనేక అక్రమాలు జరిగాయని, వారు బకాయి పెట్టిన నిధులను ప్రస్తుత ప్రభుత్వం కట్టాల్సి వస్తోందని అన్నారు. ప్రజలకు సేవచేసే భాగ్యం ఉన్నా అసెంబ్లీకి రాకపోవడం విడ్డూరమని, ప్రతిపక్ష హోదా ఇస్తే రాదని, రాజ్యాంగ బద్ధంగా వస్తుందని ఎద్దేవా చేశారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సమర్థవంతంగా విధులు నిర్వహిస్తుంటే జగన్ బెదిరించడం బాధాకరమన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు, నాయకులు వరప్రసాద్, శ్రీహరిరావు, మల్లకుప్పం, శేఖర్, నవీన్‌రాయల్, పార్థు తదితరులు పాల్గొన్నారు.

బస్సులను ఏకాగ్రతతో నడపాలి



మాట్లాడుతున్న ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ మురళీమోహన్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను ఏకాగ్రతతో నడపాలని జిల్లా రవాణాధికారి కె.మురళీమోహన్ ఆదేశించారు. ప్రజారవాణాధికారి కార్యాలయంలో మంగళవారం డ్రైవర్లకు డీపీటీవో జగదీష్ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీమోహన్ మాట్లాడుతూ సమస్యలేమైనా ఉంటే ఇంటి దగ్గరే మరిచిపోవాలని, ప్రయాణికుల క్షేమమే ధ్యేయంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వద్దని సూచించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. డీపీటీవో జగదీష్ మాట్లాడుతూ తప్పులు పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, అలిపిరి డిపో మేనేజర్ హరిబాబు పాల్గొన్నారు.

అధికారుల మనోభావాలు దెబ్బతీయొద్దు



మాట్లాడుతున్న మమత

తిరుపతి (జీవకోన), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో పనిచేసే అధికారుల మనోభావాలను దెబ్బతియ్యవద్దని, స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య విలువలను కాలరాయొద్దని టీడీపీ మహిళ నేత మమత హితవు పలికారు. పోలీసు అధికారులను లక్ష్యంగా చేసుకుని అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నేతల తీరును అమె తప్పుబట్టారు. కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వహిస్తున్న తిరుపతి ఎస్పీని లక్ష్యంగా చేసుకుని వైసీపీ మూకలు సోషల్ మీడియాలో ఇష్టానుసారం వ్యవహరించడం వారి దిగుజారుడు రాజకీయానికి నిదర్శనమని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హోటళ్లలో విస్తృత తనిఖీలు



తనిఖీలు చేస్తున్న మద్దిలేటి, రాజారెడ్డి తదితరులు

తిరుపతి (జీవకోన), నవంబరు 12(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కేటీ రోడ్డులో గల రెస్టారెంట్లలో ఆహార భద్రతాధికారి మద్దిలేటి ఆధ్వర్యంలో మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. బిరియాని, గోబీ, నూడిల్స్, చికెన్ తదితర వంటకాలు ఆకర్షణీయంగా ఉండటానికి నిషేధిత రంగులు, రుచికరంగా ఉండటానికి చైనా సాల్ట్ వంటివి వాడటం, ఫ్రిజ్‌లో కుళ్లిన మాంసాన్ని ఉంచడం గమనించారు. వంటశాలలో అపరిశుభ్రత ఉండడంతో కేసులు నమోదు చేశారు. సంబంధిత హోటళ్లపై చర్యలు తీసుకుంటామని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి తెలిపారు. నిల్వ ఆహార పదార్థాలను విక్రయిస్తే రూ.లక్ష నుంచి రూ.5లక్షల వరకు జరిమానా, ఆరు నెలల జైలుశిక్ష ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రతినిధులు దేవేంద్ర, సిబ్బంది సుమన్ తదితరులు పాల్గొన్నారు.

గేట్ కాలేజీ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతిరూరల్, నవంబరు12(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా పోటీలలో టెన్నిస్ విభాగంలో ప్రతిభ చాటి విజేతలుగా నిలిచిన స్థానిక గేట్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులను మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు అభినందించారు. మహిళల సింగిల్స్ విభాగంలో విద్యార్థి సాహితీరాజ్ విజేతగా నిలవగా, డబుల్స్ విభాగంలో హర్షితతో సాహితీరాజ్ కలసి ప్రథమస్థానం సాధించారని కళాశాల ఛైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. విద్యార్థులు మర్యాదపూర్వకంగా రిజిస్ట్రార్‌ని కలిశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత్ పాల్గొన్నారు.

తిరుపతి సర్కిల్‌కు మిగిలింది ఐదు డివిజన్లే

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ సర్కిల్ (ఉమ్మడిచిత్తూరుజిల్లా)లో మొత్తం 8 డివిజన్లు ఉండేవి. నూతన జిల్లాలు ఏర్పడిన అనంతరం, నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లా(తిరుపతి సర్కిల్)కు ఐదు డివిజన్లు కోల్పోయింది. అదనంగా రెండు డివిజన్లు చేరడంతో ఐదు డివిజన్లకు పరిమితమైంది. నూతన తిరుపతి విద్యుత్ సర్కిల్‌లో తిరుపతి టౌన్,రూరల్,పుత్తూరు మూడు డివిజన్లతో పాటు నూతనంగా నాయుడుపేట, గూడూరు డివిజన్లు అదనంగా కలిశాయి. నూతన జిల్లాల విభజన జరిగిన అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా(తిరుపతి సర్కిల్) నుంచి చిత్తూరు, రాయచోటి సర్కిళ్లు నూతనంగా ఏర్పడ్డాయి. ఈ నెల 10వ తేది నుంచే నూతన సర్కిళ్లకు కార్యనిర్వాహక విధులు, ప్రాజెక్టులు మంజూరు చేసే పనులు ఎస్ఈకి అప్పగించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేది నుంచి నూతన సర్కిల్స్‌లో కార్యనిర్వాహక విధులు నిర్వహించాలని సీఎండీ ఆదేశించారు. అయితే తిరుపతి సర్కిల్ కార్యాలయం నుంచి సిబ్బందిని బదిలీ చేయాలి. ఈ బదిలీలు చేయడంలో జాప్యం జరగడంతో నూతన సర్కిల్ కార్యాలయాల్లో పూర్తి స్థాయిలో కార్యకలాపాలు జరగడంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్కిల్ కేంద్రాల్లో ఒకటో తేది నుంచి వినియోగదారులకు సేవలందడం లేదు. డిసెంబరు ఒకటి నుంచి నూతన సర్కిల్ కార్యాలయాల నుంచి కార్యనిర్వాహక కార్యకలాపాలు నిర్వహించడానికి సర్కిల్ స్థాయి అధికారులు చర్యలు చేపట్టారు.

17న తిరుమలలో కార్తీక వనభోజనం

తిరుమల, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 17వ తేదీన కార్తీక వనభోజన కార్యక్రమం జరుగనుంది.పాపవినాశనం మార్గంలోని పార్వేట మండపంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు మలయప్పస్వామి చిన్నగజవాహనంపై, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు పల్లకీపై ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి 10 గంటలకు పార్వేటమండపానికి చేరుకుంటారు.11 నుంచి 12 గంటల మధ్య ఉత్సవమూర్తులకు స్నపనతిరుమంజనం నిర్వహిస్తారు. తర్వాత కార్తీక వనభోజన కార్యక్రమం జరుగుతుంది.ఈ కార్యక్రమ నేపథ్యంలో ఆలయంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

నివాసాల మధ్య మురుగునీరు



పొంగుతున్న డ్రైనేజీ

తిరుపతి అర్బన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కంచిమఠం సమీపంలోని టీటీడీ క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో అండర్ డ్రైనేజీ పొంగుతోంది. వారం రోజులుగా రెండు మ్యాన్‌హోల్స్ నుంచి మురుగునీరు జోరుగా పారుతూ తూర్పు, దక్షిణ వీధుల్లో ప్రవహిస్తోంది. దుర్వాసన భరించలేక స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాదచారులు మురుగునీటిపై నడుస్తూ అవస్థపడుతున్నారు. కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



పవర్‌ఫుల్.. నెల్లటూరు

- 70 శాతం ఇళ్లల్లో విద్యుత్తుశాఖ ఉద్యోగులే
- సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయమే కారణం

నెల్లటూరు.. వెంకటగిరి ప్రధాన రహదారిలో, గూడూరు పట్టణ పరిధి దాటగానే ఈ గ్రామం ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో 400కు పైగా ఇళ్లున్నాయి. 280కు పైగా గృహాలలో విద్యుత్తు శాఖలోని ఏదో ఒక విభాగంలో ఉద్యోగులుగా పనిచేసే వారుంటారు. అందుకే ఆ గ్రామం 'పవర్'ఫుల్ అంటూ చమత్కరిస్తుంటారు. - గూడూరు , ఆంధ్రజ్యోతి

మార్పు మొదలైందిలా..



జిల్లా స్టోర్స్ కార్యాలయం

గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి ఆనుకుని గోగినేనిపురం వస్తుంది. ఆ రోజులలో గోగినేనిపురం.. మైకా పరిశ్రమలకు ప్రసిద్ధి. గూడూరు, నెల్లటూరు, చెన్నూరు, తిప్పవరపాడు గ్రామాల నుంచీ ఆడ, మగ కార్మికులు మైకా పరిశ్రమలలో పనులకు వెళ్లి జీవనోపాధి పొందేవారు. ఈ క్రమంలో నెల్లటూరు గ్రామంలో విద్యుత్‌శాఖ 1956వ సంవత్సరంలో జిల్లా స్టోర్స్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో దీని కోసం ఓ దాత ఆరు ఎకరాల స్థలం ఇచ్చారు. ఈ స్టోర్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, విద్యుత్తు తీగలను నిల్వ ఉంచి.. నెల్లూరు జిల్లాలో అవసరమైన చోటికి తరలించేవారు. జిల్లాలో మరమ్మతులకు గురైన ట్రాన్స్‌ఫార్మర్లనూ ఇక్కడికి తీసుకొచ్చి.. బాగు చేసి పంపేవారు. వీటికి కూలీల అవసరం ఎక్కువ. అదే సమయంలో కొన్ని కారణాలతో మైకా పరిశ్రమలలో మగవాళ్లను తొలగించి మహిళలకే అవకాశం ఇచ్చారు. దీంతో నెల్లటూరు గ్రామానికి చెందిన వారు విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ పనులతో పాటు సిమెంట్ విద్యుత్ స్తంభాల నిర్మాణ, ఇతర పనులు చేసేందుకు కాంట్రాక్టు కార్మికులుగా చేరారు.

సీఎంగా ఎన్టీఆర్ తీసుకున్న నిర్ణయం..

1983 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. ఎన్టీఆర్ సీఎం అయ్యాక కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేశారు. దీంతో కాంట్రాక్టు కార్మికులు.. వారి అర్హతను బట్టి హెల్పర్లుగా పర్మినెంట్ ఉద్యోగులుగా మారిపోయారు. ఇక్కడ నుంచే ఉద్యోగాల ప్రస్థానం మొదలైంది. క్రమేణా విద్యుత్ వినియోగం పెరగడంతో కొత్తగా సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరిగాయి. ఆ సబ్‌స్టేషన్లలో షిఫ్టు ఆపరేటర్ల ఉద్యోగాల కోసం.. జిల్లాస్టోర్స్‌లో పనిచేసే సిబ్బంది తమ పిల్లలను అర్హతను బట్టి చేర్పించారు. ఇక, హెల్పర్లు.. లైన్‌మెన్‌గా పదోన్నతులు పొందారు. కొంతమంది ఉద్యోగులు అనారోగ్యంతో మృతి చెందగా.. కారుణ్య నియామకాల కింద వారి పిల్లలు అదే శాఖలో ఉద్యోగాలు పొందారు. కొంతకాలం కిందట గోగినేనిపురంలో డివిజన్ విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడా ఎక్కువ మంది సిబ్బంది నెల్లటూరుకు చెందిన వారే. ఇలా కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న వారు క్రమేణా పర్మినెంట్ కావడం, లైన్‌మ్యాన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు పొందారు. అటెండర్ల నుంచి ఏడీఈల వరకు.. ఇలా ఏదో ఒక స్థాయిలో విద్యుత్‌శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఇక, వాహనాలలో విద్యుత్ పరికరాలను లోడ్, అన్‌లోడ్ చేసేందుకు సుమారు 30 మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు.



జిల్లా స్టోర్స్‌లోని విద్యుత్ పరికరాలు



తిరుమలలో కొలువుదీరిన పంచమూర్తుల్లో ఒకరైన ఉగ్రశ్రీనివాసుడు ఏటా ఒకసారి మాత్రమే గర్భాలయం దాటి వస్తారు. కైశికద్వాదశి ఆస్థానం సందర్భంగా వేకువజామున మాడవీధుల్లో ఊరేగి.. సూర్యోదయానికి ముందే తిరిగి లోపలకు వెళ్లిపోతారు. శ్రీవారి ఆలయంలో బుధవారం ఈ ఉత్సవం జరగనుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

వైసీపీలో రసవత్తరంగా వర్గపోరు



జగన్‌తో మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి తదితరులు

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ వైసీపీ వర్గ రాజకీయం రసవత్తరంగా మారింది. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అనుకూల, వ్యతిరేక వర్గాలుగా పార్టీ ఎప్పుడో చీలిపోయింది. సంజీవయ్య టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ ఎన్నికలకుముందు చెంగాళమ్మ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం స్పష్టంచేశాయి. ఇవేవీ పట్టించుకోని అధిష్టానం 3వ సారి కిలివేటి సంజీవయ్యకే టిక్కెట్ కేటాయించడంతో ఆ ఎన్నికల్లో వీరంతా కొంత వ్యతిరేకంగా పనిచేశారన్న ప్రచారం జరిగింది. కూటమి అధికారంలోకి రావడంతో దువ్వూరు బాలచంద్రారెడ్డి టీడీపీలో చేరతానంటూ ప్రకటించడంతో ఆ వర్గం నాయకులంతా ఆ పార్టీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఈ వర్గం టీడీపీలో చేరేందుకు ఆ పార్టీలో ఉన్న ఒక వర్గం అడ్డుకోవడంతో దువ్వూరు వర్గం చేరిక వాయిదాపడింది. ఈ క్రమంలో సంజీవయ్య వర్గం గత శుక్రవారం వైసీపీ అధినేత జగన్‌ను కలిసి మున్సిపల్ ఛైర్మన్ శ్రీమంత్‌రెడ్డి వర్గంపై ఫిర్యాదు చేశారు. టీడీపీతో తిరుగుతూ పార్టీ ఓటమికి కృషి చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి ప్రధాన కారణమంటూ వివరించారు. జగన్ ఆదేశాలతో ఉమ్మడి నెల్లూరుజిల్లా వైసీపీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శేఖర్‌రెడ్డికి షోకాజ్ నోటీసు జారీచేశారు. అదే సమయంలో మంగళవారం మధ్యాహ్నం మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వర్గం నాయకులు తాడేపల్లిలో వైఎస్ జగన్‌ను కలిశారు. షోకాజ్ నోటీసు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. తమను కిలివేటి సంజీవయ్య కలుపుకుపోవడంలేదని వారు సైతం ఫిర్యాదు చేసినట్లుగా సమాచారం. అన్నింటిని పక్కనపెట్టి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని జగన్ చెప్పినట్లుగా తెలుస్తుంది. జగన్‌ను కలసినవారిలో దబ్బలతోపాటు కళత్తూరు శేఖర్‌రెడ్డి, తడ ఎంపీపీ కొలవి రఘురెడ్డి, నాయకులు గండవరం సురేష్‌రెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, తిరుపాల్, శరత్‌యాదవ్ తదితరులున్నారు.

ఇద్దరు అర్చకులకు షోకాజ్ నోటీసులు

ఎర్రావారిపాలెం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తలకోన సిద్ధేశ్వరాలయంలో భక్తుల ఎదుటే ఘర్షణకు దిగిన ఇద్దరు అర్చకులకు దేవాదాయశాఖ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఆలయంలో ప్రసన్న కుమార్‌స్వామి, సత్యప్రసాద్‌లు అర్చకులుగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది శివరాత్రి బ్రహ్మోత్సవాల సమయంలో అప్పటి ఈఓ జయకుమార్ సిఫార్సుతో ప్రసన్నకుమార్ స్వామి కుమారుడిని తాత్కాలిక అర్చకుడిగా నియమించారు. కొద్ది రోజులు అతను పనిచేశారు. అర్చకుల సెలవుల సందర్భంలో సేవలందిస్తున్నారు. ఈయన నియామకాన్ని వ్యతిరేకిస్తూ మరో అర్చకుడు సత్యప్రసాద్ దేవదాయ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అర్చకుల మధ్య స్పర్థలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో వీరిద్దరూ ఇటీవల భక్తుల ఎదుటే కొట్టుకున్నారని సమాచారం. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో కూడా నమోదయ్యాయి. దీంతో ఆలయ ఈఓ మమత విచారించి మంగళవారం ఇద్దరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

కాలువలో పడి చిన్నారి మృతి



లహరి (ఫైల్‌ఫొటో)

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కాలువలో పడి చిన్నారి మృతి చెందింది. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి తెలిపిన వివరాలు... శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన మధు శ్రీకాళహస్తిలో స్థిరపడ్డారు. నింద్ర ప్రభుత్వ పాఠశాలలో ఆయన ఉపాధ్యాయుడు.ఈ దంపతులు శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రోడ్డులో సాయినగర్‌లో నివాసం ఉంటున్నారు. భార్య కల్పన గృహిణి. వీరికి నాల్గో తరగతి చదివే కుమారుడు, ఆరేళ్ల చిన్నారి లహరి ఉన్నారు. కుమార్తె లహరి మానసికంగా పరిణితి చెందలేదు. దీంతో ప్రత్యేక ప్రతిభావంతురాలైన బాలికను తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలోని భవిత కేంద్రంలో సోమవారం చేర్పించారు. మంగళవారం మధ్యాహ్నం భోజన విరామంలో లహరి భవిత కేంద్రం వద్ద అదృశ్యమైంది. సిబ్బంది వెంటనే బాలిక తల్లిదండ్రులు, రెండో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చారు. చిన్నారి ఆచూకీ కోసం అందరూ గాలించారు. భవిత కేంద్రం సమీపంలో కాలువలో పడి బాలిక మృతి చెందినట్లుగా కాసేపటి తరువాత గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉగ్రశ్రీనివాసుడు

గడప దాటేది ఏడాదికోసారే

- 800 ఏళ్ల కిందటి వరకు ఈయనే ఉత్సవమూర్తి
- ఓ సంఘటనతో ఆ స్థానంలోకి మలయప్ప
- నేడు శ్రీవారి ఆలయంలో కైశిక ద్వాదశి ఆస్థానం

తిరుమల గర్భాలయంలో మూలవిరాట్‌తో పాటు మరో నలుగురుమూర్తులు ఉంటారు. కోర్కెలు తీర్చేది ధ్రువబేరమైన మూలమూర్తి అయితే.. నిత్యసేవలు భోగ శ్రీనివాసమూర్తి (కౌతుకబేరం) అందుకుంటారు. లెక్కలు అందుకునే స్వామి కొలువు శ్రీనివాస మూర్తి(బలిబేరం). మలయప్ప(ఉత్సవబేరం)ను భక్తులంతా తరచూ వీక్షిస్తుంటారు. ఉత్సవాల సమయంలో ఆలయం నుంచి బయటకు వివిధ వాహనాలపై దర్శనమిచ్చేది ఈ స్వామే. ఐదోవది స్నపనబేరంగా పిలిచే ఉగ్రశ్రీనివాసమూర్తి. ఈయన్ను 'వెంకటంతురైవారు' అని కూడా పిలుస్తారు. 14వ శతాబ్దం వరకు ఉగ్రశ్రీనివాసుడే ఉత్సవమూర్తిగా ఉండేవారని పురాణోక్తి.

ఆ పేరు వెనుక..

ఉగ్రశ్రీనివాసుడని పేరు రావడానికి ఓ ఇతిహాసం ప్రాచుర్యంలో ఉంది. క్రీ.శ.1330 నాటి బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తి ఊరేగుతుండగా ఈ స్వామిపై సూర్యకిరణాలు పడ్డాయట. దీంతో తిరుమలలో పెద్ద అగ్నిప్రమాదం జరిగి చాలా ఇళ్లు దగ్ధమయ్యాయట. ఈ క్రమంలోనే సమీపంలోని భక్తుల్లో ఒకరి ద్వారా 'ఇకపై నన్ను ఉత్సవమూర్తిగా వాడద్దు. అలా చేస్తే అగ్నిప్రమాదం వంటి అనర్థాలే జరుగుతాయి' అని స్వామి చెప్పారట. తిరుమల లోయల్లో తానే ఇంకొకమూర్తిగా శ్రీదేవి, భూదేవి సహా సహ ఉన్నానని, ఎక్కడ వెతకాలో గుర్తులు కూడా చెప్పారట. ఆ స్వామినే (ప్రస్తుత శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి) ఉత్సవ మూర్తిగా కొలువుదీర్చాలని ఆదేశించారట. అప్పట్నుంచి ఉగ్రశ్రీనివాసమూర్తిగా పేరు వచ్చింది.

నేడు స్వామివారి ఊరేగింపు

ఏటా శ్రీవారి ఆలయంలో కైశికద్వాదశి ఆస్థానాన్ని నిర్వహిస్తారు. ఆ ఒక్కరోజు మాత్రమే ఉగ్రశ్రీనివాస మూర్తి వేకువజాము ఆలయం నుంచి బయటకు వచ్చి నాలుగు మాడవీధుల్లో ఊరుగుతారు. సూర్యకిరణాలు పడకముందే తిరిగి స్వామిని ఆలయంలోకి తీసుకెళ్లిపోతారు. ఈ ఉత్సవం బుధవారం జరగనుంది.

మా డబ్బు మాకు వెనక్కివ్వండి

- తిరుపతి విమానాశ్రయంలో ప్రయాణికుల ఆందోళన

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో మంగళవారం ప్రయాణికులు ఆందోళనకు దిగారు. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15గంటలకు తిరుపతికి చేరుకుని తిరిగి హైదరాబాద్‌కు 8.15 గంటలకు వెళ్లాల్సిన ఎయిర్ అలయన్స్ విమానాన్ని సాంకేతిక కారణాలతో సోమవారం హైదరాబాద్‌లోనే రద్దు చేశారు.ఈ విమానంలో సోమవారం హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికులకు సమాచారం ఇవ్వడంతో కొంత మంది నగదు వెనక్కు తీసుకుని వెళ్లగా కొంత మంది మంగళవారం వెళ్లేందుకు సిద్ధమయ్యారు. వీరిలో 40మంది మంగళవారం ఉదయం తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్నారు. సాంకేతిక కారణాలతో విమానం రద్దయినట్టు సిబ్బంది చెప్పడంతో ప్రయాణికులు సహనం కోల్పోయి ఆందోళనకు దిగారు. ప్రతిసారీ ఇలా సాంకేతిక కారణాలు చూపుతూ రద్దు చేయడంపై సిబ్బంది మీద ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బు వెనక్కిస్తే వేరే విమానంలో వెళతామని చెప్పగా సంస్థ సిబ్బంది సమాధానం చెప్పలేదు. దీంతో ప్రయాణికులు వారిని చుట్టుముట్టడంతో 48 గంటల తరువాత ప్రయాణికుల ఖాతాల్లో టిక్కెట్ల బుకింగ్ వాపస్ డబ్బు పడుతుందని చెప్పారు.దీంతో కొంతమంది వెనుదిరగ్గా మరికొంతమంది వేరే విమానంలో టిక్కెట్లు బుక్ చేసుకుని హైదరాబాద్‌కు పయనమయ్యారు.



ఎయిర్ అలయన్స్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు

ఉన్న పంటను సాగు చేసుకోండి

- కళత్తూరు దళితులకు కలెక్టర్ భరోసా

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వివాదంలో ఉన్న భూముల్లో ప్రస్తుత సాగును పూర్తి చేసుకోవాలని కొత్తసాగుకు అనుమతి లేదని కలెక్టర్ చెప్పారు. మండలంలోని అటవీశాఖ భూ వివాదంపై మంగళవారం కళత్తూరు దళిత రైతులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను, డీఎఫ్‌వో వివేక్‌ను కలిసి తమగోడును వినిపించారు. స్పందించిన అధికారులు ప్రస్తుతానికి వివాదంలో ఉన్న నేలలో జరుగుతున్న సాగును పూర్తి చేసుకోవాలన్నారు. కొత్తగా పంటలు పెట్టొద్దని కలెక్టర్, డీఎఫ్‌వో చెప్పారు. దీంతో రైతులు ప్రస్తుతం వేరుశనగ సీజన్ కాబట్టి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరినా డీఎఫ్‌వో అంగీకరించలేదు. సాగులో ఉన్న పంటకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని మిగిలిన దాంట్లో అడుగుపెడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని అప్పటి వరకు సంయమనం పాటించాలన్నారు. టవర్లను ఎక్కడం మానుకోవాలని హితువు పలికారు. దీంతో రైతులు వెనుదిరిగారు.

టీడీపీ వర్క్‌షాప్‌కు బహిష్కృత ఎమ్మెల్యే



సత్యవేడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో మంగళవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన టీడీపీ వర్క్‌షాప్‌కు ఆ పార్టీ బహిష్కృత ఎమ్మెల్యే ఆదిమూలం హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. ఆయనపై లైంగిక ఆరోపణల నేపథ్యంలో సెప్టెంబరు 5న పార్టీ నుంచి సస్పెండు చేసిన విషయం తెలిసిందే. లైంగిక ఆరోపణల కేసు హైకోర్టులో వీగిపోవడంతో ఆదిమూలంపై సస్పెన్షన్ ఎత్తివేయాలని నియోజకవర్గ నా యకులు అధిష్టానాన్ని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళగిరిలో బడ్జెట్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరు కావడం స్థానికంగా చర్చకు దారి తీసింది.





తిరుమలలో సినీ హీరోలు

మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న సినీ హీరో మంచు విష్ణు

శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు మంగళవారం రాత్రి తిరుమల చేరుకున్న సినీ కథానాయకుడు వరుణ్‌తేజ్



క్యాన్సర్‌పై అవగాహన పోస్టరును విడుదల చేస్తున్న కలెక్టర్ తదితరులు

రేపటి నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

- ప్రతి బృందం రోజుకు 5 కుటుంబాలకు పరీక్షలు చేయాలన్న కలెక్టర్

తిరుపతి(వైద్యం), నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్యాన్సర్‌ను నిర్మూలించేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. గురువారం నుంచి ఇంటింటికి వెళ్లి నిర్వహించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఆయన స్విమ్స్‌లోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రతి వైద్యుడు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రజల ఆరోగ్య భద్రతకు సంబంధించి ఈ నెల 18 నుంచి నిర్వహించే పలు వైద్య పరీక్షల సమాచారాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని వైద్యాధికారులకు సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు బీపీ, షుగర్, గుండె జబ్బులు, థైరాయిడ్, పక్షవాతం వంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలను స్నేహపూర్వకంగా నిర్వహించాలన్నారు. ఆ వివరాలను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలన్నారు. దీనికి ఏర్పాటు చేసిన బృందాలు రోజుకు 5 కుటుంబాలను కలిసి వైద్య పరీక్షలు చేయాలన్నారు. వైద్యాధికారులతో కలిసి క్యాన్సర్ అవగాహన పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో శ్రీహరి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏది గోల్డు.. ఏది రోల్డు?

- టౌన్ బ్యాంకులో అప్రైజర్ చేతివాటం
- కుటుంబ సభ్యుల పేరిట నకిలీ బంగారం తాకట్టు
- ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సస్పెన్షన్
- ఆందోళనలో ఖాతాదారులు

బ్యాంకుల్లో అసలు గోల్డ్ ఏదో, రోల్డ్ గోల్డ్ ఏదో తేల్చాల్సింది అప్రైజర్. బంగారు నాణ్యతను పరీక్షించి గ్రాముకు ఎంతివ్వాలో నిర్ణయించేదీ అతడే. అప్రైజర్‌ను మెప్పిస్తేనే అనుకున్న రుణం దొరుకుతుంది. లేకుంటే బంగారంలో రాళ్లున్నాయని కోతలేస్తుంటారు. అదే అప్రైజర్ తలుచుకుంటే నకిలీ బంగారు కూడా అసలైపోతుంది. తాజాగా తిరుపతి టౌన్‌బ్యాంకులో ఓ అప్రైజర్ చేతివాటం బ్యాంకు వర్గాల్లో కలకలం రేపింది. ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన తిరుపతి టౌన్ బ్యాంకులో అప్రైజర్లు చేతివాటం చూపించడం ఇది రెండోసారి. 30 ఏళ్ల కిందట ప్రభాకర్ అనే అప్రైజర్ దొంగ బంగారం తనఖాపెట్టి వేలల్లో కాజేసి దొరికిపోయాడు. తాజాగా టౌన్‌బ్యాంకుతిరుమల శాఖలో చేరిన రూపేష్ తన భార్య, అమ్మ పేరిట నకిలీ బంగారం పెట్టి రూ.ఆరు లక్షలు కాజేయడంతో ఖాతాదారుల్లో ఆందోళన కలిగించింది. ఏడాది తర్వాత రెన్యువల్ చేసుకునే క్రమంలో బ్యాంకు అధికారులకు అనుమానం వచ్చి తనిఖీ చేయించగా అసలు గుట్టు ఆలస్యంగా బయటపడింది. విచారణలో వెల్లడికావడంతో నగదును రికవరీ చేసి విధులనుంచి సస్పెండ్ చేశారు. కాగా, టౌన్ బ్యాంకులోని వివిధ శాఖలో ఐదుగురు అప్రైజర్లు పనిచేస్తున్నారు. గతంలో తరుచూ అంతర్గత బదిలీలు లేకపోవడంతో ఒకేశాఖలో దీర్ఘకాలం ఉండేవారు. దీంతో అవకతవకలకు పాల్పడే అవకాశం ఏర్పడింది. ఇందులో భాగంగానే తిరుమల బ్యాంకులో పని చేసే రూపేష్ తన చేతివాటాన్ని చూపాడు. కూటమి ప్రభుత్వం వచ్చాక అప్రైజర్ల అంతర్గత బదిలీలు చేయడంతో నకిలీ బంగారం వెలుగులోకి వచ్చింది. లేకుంటే అదే అప్రైజర్ ఉండుంటే ఈ నకిలీ బంగారం రెన్యువల్ అయిపోయేది. కాగా, గతంలో టౌన్‌బ్యాంకులోని అన్ని శాఖల్లో రోజుకు రూ.50లక్షల వరకు బంగారు రుణాలను ఖాతాదారులు పొందేవారు.బ్యాంకు మీద విశ్వాసం సన్నగిల్లడంతో ప్రస్తుతం రూ.20లక్షల రుణాలు కూడా తీసుకోవడంలేదు. ఈ ఘటన నేపథ్యంలో అన్ని శాఖల్లో తనఖా ఉన్న బంగారాన్ని తనిఖీ చేసి ఖాతాదారులకున్న అనుమానాలను తెరదించాల్సిన బాధ్యత టౌన్‌బ్యాంకు పాలకమండలి, అధికారయంత్రాంగంపై ఉంది.అడ్డంగా దొరికినప్పుడు ఉద్యోగం నుంచి తప్పించి చేతులు దులుపుకొంటున్నారే గానీ చట్టపరమైన చర్యలకు బ్యాంకు వర్గాలు వెనకడుగు వేస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

జాతీయ బ్యాంకుల్లోనూ..

కోఆపరేటివ్ బ్యాంకుల్లోనే కాకుండా జాతీయ బ్యాంకుల్లోనూ అప్రైజర్లు అప్పుడప్పుడూ నకిలీ బంగారం పెట్టి నగదు స్వాహా చేసిన ఘటనలు అనేకం ఉన్నాయి. జాతీయ బ్యాంకుల్లో కమీషన్ పద్ధతి కింద అప్రైజర్లు పనిచేస్తుంటారు. ఏళ్ల తరబడి ఒకే శాఖలో ఉండటంతో అవకతవకలు జరిగే అవకాశంలేకపోలేదు. 'దొరికినవాడు దొంగ దొరకనివాడు దొర' అన్నట్టుగా కొందరు అప్రైజర్లు చెలామణి అవుతున్నారన్న విమర్శలున్నాయి.

తనఖా బంగారాన్నంతా తనిఖీ చేస్తున్నాం

టౌన్ బ్యాంకు పరిధిలోని తనఖా ఉన్న బంగారాన్నంతా తనిఖీ చేస్తున్నాం. ఇప్పటికే తిరుమల శాఖలో బంగారాన్ని పరిశీలించాం. పునఃతనిఖీ కోసమే మాజీ సీనియర్ అప్రైజర్ ఎం.వే దాచలంను నియమించాం. ఆయా శాఖల మేనేజర్లతో కలిసి తన ఖాలో ఉన్న బంగారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని లేఖలు రాశాం. రూపేష్‌ను సస్పెండ్ చేశాం. కమిటీ నిర్ణయం తర్వాత డిస్మిస్ చేస్తాం. ప్రస్తుతం రెండు, మూడు నెలలకోసారి అప్రైజర్లను అంతర్గతంగా బదిలీచేసేలా నిర్ణయం తీసుకున్నాం. ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. వారి బంగారు సురక్షితం.

- శివకుమార్‌రెడ్డి, ఎండీ, తిరుపతి టౌన్ బ్యాంకు

పుత్తూరు వార్తలు

చట్టవిరుద్ధంగా మున్సిపల్ కౌన్సిల్ కో-ఆప్షన్ సభ్యుడి నియామకం

కలెక్టర్‌కు ఫిర్యాదు ● విచారణకు ఆదేశం

పుత్తూరు అర్బన్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపల్ పాలక మండలిలో వైసీపికి చెందిన కో-ఆప్షన్ సభ్యుడు చీరాలయ్య నియామకం చట్ట విరుద్ధంగా జరిగిందని కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. క్రిస్టియన్ మైనార్టీకి ప్రత్యేక కేటగిరి కింద రిజర్వ్ చేసిన పోస్టును నకిలీ ధ్రువపత్రంతో ఆయన దక్కించుకున్నారని పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అశోక్ సామ్రాట్ ఫిర్యాదులో పేర్కొన్నారు. షెడ్యూల్ కులం నుంచి క్రిస్టియన్‌గా మారిన చీరాలయ్య నియామకాన్ని వారు తప్పుబట్టారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను కూడా పొందుపరిచారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో విచారణ అధికారిగా పుత్తూరు మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. చీరాలయ్య నియామకానికి సహకరించి నిబంధనలు అతిక్రమించిన ప్రతి ఒక్కరినీ శిక్షించాలని అశోక్ సామ్రాట్ డిమాండ్ చేశారు.

అకౌంటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు అపారం

పుత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అకౌంటింగ్ రంగంలో ఉపాధి అవకాశాలు అపారంగా ఉన్నాయని వాణిజ్యశాస్త్ర విభాగ అధిపతి దేవకి అన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ అకౌంటింగ్ దినం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారంలో పారదర్శకత, ఉత్పాదకతను పెంచడానికి, మానవ లోపాలను సరిదిద్దడానికి అకౌంటింగ్ చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాసవి, తిరుమలయ్య, గంగయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 28 మంది ఎంపిక



పుత్తూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలోమంగళవారం జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 28 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని ఆ కళాశాల ఛైర్మన్ సురేంద్రరాజు తెలిపారు. ఫస్ట్ సోర్స్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు సుమిత్ జాన్, అనిల్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా షణ్ముగరెడ్డి



పుత్తూరు టౌన్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా షణ్ముగ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా సేవలందిస్తున్న షణ్ముగ రెడ్డి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సిఫారసు మేరకు రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నియమితులయ్యారు.ఈ సందర్భంగా షణ్ముగరెడ్డి మాట్లాడుతూ బీసీల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించండి

పుత్తూరు టౌన్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పుత్తూరు కార్మిక శాఖాధికారి హేమాచారి కోరారు. మంగళవారం ఆయన పుత్తూరు మున్సిపాలిటీలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇద్దరు బాల కార్మికులను గుర్తించారు. 14 సంవత్సరాల్లోపు బాలలను పనిలోకి పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. కార్యక్రమంలో తిరుపతి కార్మిక శాఖాధికారి శ్రీమన్నారాయణ, ప్రవీణ్‌కుమార్, రాజయ్య, కోర్టు సిబ్బందులు,కార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ భాషోపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

పుత్తూరు టౌన్, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): హిందీ పాఠ్యాంశాలు, ఇతివృత్తాలు, ప్రక్రియలు, పాఠ్యప్రణాళి బోధన, నమూనా ప్రశ్నపత్రాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కే.వి.ఎన్.కుమార్ తెలిపారు. మంగళవారం హిందీ భాషోపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృత్యంతర శిక్షణ నిర్వహించారు. అనంతరం బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు.

రెండు మట్టి ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ సీజ్

వరదయ్యపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం మండలం బత్తలవల్లం గ్రామం చెదలపాకం వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేని రెండు మట్టి ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్‌ను వరదయ్యపాళెం పోలీసులు తెలిపారు. వాటిని తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి అప్పగించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విమానాశ్రయంకు వెళ్లే రామకృష్ణ కూడలి వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వయసు 35 సంవత్సరాలుంటాయని ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ రైటర్ కృష్ణమూర్తి తెలిపారు.

మద్యం స్వాధీనం: ఒకరి అరెస్టు

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం తరలించి విక్రయిస్తున్న ఓ మహిళను తిరుపతి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. మండలం గుత్తివారిపల్లి హైవే సమీపంలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్టు. ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. ఈమేరకు తిరుపతి రూరల్ ఎక్సైజ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని మునిరత్నమ్మను అదుపులోకి తీసుకుని 12 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

బకాయిలు ఇప్పించండి

● మంత్రి అచ్చెన్నాయుడిని కోరిన చెరకు రైతులు



పిచ్చాటూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం రూ.36 కోట్ల బకాయిలు చెల్లించకుండా మీనమేషాలు లెక్కిస్తోందంటూ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి చెరకు రైతుల అసోసియేషన్ నాయకులు, తిరుపతి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సతీష్‌నాయుడుకు ఫిర్యాదు చేశారు. మంగళవారం విజయవాడలోని మంత్రి కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి సుమారు 400 మంది రైతులకు ఆరు సంవత్సరాలు బకాయిల చెల్లించకుండా యాజమాన్యం తిప్పించుకుంటోదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చెరకు రైతు అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణస్వామి నాయుడు, ఉపాధ్యక్షుడు గజేంద్రరెడ్డి, సభ్యులు పెమ్మసాని మురళి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



సత్యవేడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లడం ఎస్టీ కాలనీలో అక్రమంగా దాచి ఉంచిన 72 బస్తాల రేషన్ బియ్యాన్ని శ్రీసిటీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ నిల్వలపై సమాచారం అందడంతో సీఐ శ్రీనివాసులు సిబ్బందితో సోమవారం ఎస్టీ కాలనీలో పోలయ్య ఇంట్లో దాచి ఉంచిన బియ్యం బయాన్ని స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన రమేష్, బాలరాజును అదుపులో తీసుకున్నామని తెలిపారు.

గోతుల దారుల్లో కుంటలు

● చినుకురాలితే రొచ్చురొచ్చుగా రోడ్లు
● నరకప్రాయంగా ప్రయాణం





దుస్థితిలో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్డు - సాయినగర్ రోడ్డు - జీఎన్‌టీ రోడ్డు





పోలీస్ స్టేషన్ సమీపంలో పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): అసలే గోతులు తేలిన రోడ్లు... చినుకు పడితే చాలు రొచ్చురొచ్చుగా మారుతున్నాయి. వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుండడంతో దారులన్నీ బురదమయంగా మారి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూళ్లూరుపేటలో మంగళవారం వేకుజామున నుంచి జల్లులతో కూడిన వర్షం కురవడంతో పట్టణంలోని చాలా ప్రాంతాల్లో రోడ్లు రొచ్చురొచ్చుగా మారింది. జాతీయ రహదారి నుంచి పట్టణానికి వెళ్లే జీఎన్‌టీ రోడ్డు గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలవడంతో వాహన దారులకు నరకాన్ని చూపుతోంది. హోలీక్రాస్ కూడలి నుంచి కేఎస్ సూపర్ మార్కెట్ వరకు ప్రధాన రోడ్డు గోతులమయంగా మారి నీరు నిలిచి చెరువును తలిపిస్తోంది. గాండ్లవీధి, సాయినగర్, ఆర్డీవో కార్యాలయానికి వెళ్లే రోడ్లూ అధ్వానంగా మారాయి. జీఎన్‌టీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, షార్ బస్టాండు సమీపంలో మురుగు కాలువలు పొంగి రోడ్లపైకి చేరింది. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలు కూడా వర్షానికి రొచ్చురొచ్చు మారాయి.





పెళ్లకూరు మండలం టెంకాయతోపు వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు - పెళ్లకూరులో దుక్కి సిద్ధం చేస్తున్న రైతులు

ఊపందుకున్న రబీ సాగు

జోరుగా వరినాట్లు



సూళ్లూరుపేట: వరినాట్లకు నారుతీస్తున్న కూలీలు

పెళ్లకూరు/సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. రబీ వరిసాగు పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల్లో దుక్కి సిద్ధం చేస్తుండగా, మరికొన్ని గ్రామాల్లో వరికి నారుమడులు వేశారు. కొన్ని గ్రామాల్లో వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. పెళ్లకూరు, చిల్లకూరు, జీలపాటూరు, కప్పగుంటకండ్రిగ, పాలచ్చూరు, పసుపుకండ్రిగ తదితర గ్రామాల్లో నాట్లు వేస్తుండగా, రావులపాడు, బీమవరం, పునబాక, శిరసనంబేడు, అర్ధమాల, ఆర్లపాడు తదితర గ్రామాల్లో నారుమడులు పోస్తున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు తెలుగుగంగ నీళ్లు చెరువులకు చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. ఇదేరీతిలో వర్షాలు కొనసాగితే పంటలు సాగు మరింత ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి. చెన్నప్పనాయుడుపేట, నందిమాల ఆర్లపాడు బంగారంపేట, మోదుగులపాలెం తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న ఎల్లి పైర్లకు ప్రస్తుత వర్షాలు ఊపిరిపోశాయి.గత పది రోజులుగా చినుకు లేకపోవడంతో ఎల్లి పైర్లు ఎండుముఖం పట్టాయి. సోమవారం నుంచి ప్రారంభమైన వర్షం ఎల్లి పైర్లు సాగు చేస్తున్న రైతులకు ఊరటనిచ్చింది. ● సూళ్లూరుపేట మండలంలో అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కుదిరి, చెరువు కండ్రిగ, మంగళంపాడు, ఇలుపూరు, మన్నారుపోలూరు తదితర గ్రామాల్లో వరినాట్లు ముమ్మరంగా వేస్తున్నారు.

సీఎం చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు







పిచ్చాటూరు/ ఏర్పేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రజానగరం జడ్పీ హైస్కూలు బయాలజీ ఉపాధ్యాయుడు కామాక్షయ్యకు విజయవాడలో జరిగిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. మంగళవారం అవార్డు గ్రహీతను ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజులతో పాటు పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఏర్పేడు మండలంలోని పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్, బండారుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.

నేలలో తేమ ఉన్నపుడే విత్తుకోవాలి

నారాయణవనం, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): రబీలో వేరుశనగ విత్తనాలను నేలలో తేమ ఉన్నప్పుడే విత్తుకోవాలని ఏవో శోభారాణి సూచించారు. విత్తడానికి ముందు కిలో విత్తనాలకు ఇమిడాక్లోప్రిడ్ 2 ఎంఎల్, 4 ఎంఎల్ నీరు కలిపి శుద్ధి చేసుకోవాలన్నారు. ఆ తర్వాత కిలో విత్తనాలకు కిలో టెబుకొనజల్ కలిపి విత్తుకున్నట్లయితే వేరు, కాండం, మొవ్వు కుళ్లు రాకుండా నివారించవచ్చన్నారు. అలాగే వరికి సుడిదోమ ఆశించకుండా ప్రతి 2 మీటర్లు ఊడ్పుకి 20 సెంటీమీటర్లు కాలిబాటలు వేసుకోవాలని తెలిపారు. డ్రమ్ సీడర్, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు రాయితీపై ఇవ్వాలని రైతులు కోరారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు వెలంపాడు విద్యార్థులు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి మండలం వెలంపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీపోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల సత్యవేడులో జరిగిన రగ్బీ అంతర్‌జిల్లాల పోటీల్లో అండర్ -14 విభాగంలతో విష్ణు, చాముండేశ్వరి, అండర్ -17 విభాగంలో సుబ్రహ్మణ్యం దివ్య ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారు.

పరశురామేశ్వరుడి సేవలో బిగ్‌బాస్ సభ్యులు



ఏర్పేడు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని బిగ్‌బాస్ ఫేం మెహబూబ్, దీప్తి, సునయన, హారిక తదితరులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు

శ్రీసిటీ, నవంబరు 12: మహిళను వేధించిన వ్యక్తిపై శ్రీసిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు... తమిళనాడు రాష్ట్రం ఆరంబాక్కంకు చెందిన మహిళ ఇంటర్వ్యూ నిమిత్తం మంగళవారం శ్రీసిటీకి వచ్చింది. ఈ క్రమంలో తన బంధువుల ఇంటికి ఆరూరుకు వెళ్లేందుకు బస్‌కోసం వేచి చూస్తోంది. ఇంతలో బైక్‌పై వచ్చిన ఆరూరుకు బంధువు స్టాలిన్ ఆ మహిళను తన బైక్‌పై ఎక్కించుకుని బయల్దేరాడు. మార్గమధ్యంలో సదరు మహిళను స్టాలిన్ వేధించాడు. దీంతో భయపడిన మహిళ బైక్ నుంచి దిగేసింది. స్థానికుల సాయంతో శ్రీసిటీ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదుతో శ్రీసిటీ పోలీసులు నిందితుడిని అదుపులో తీసుకున్నారు.

గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను నడపండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు నుంచి తిరుమలకు బస్సు సర్వీసులను నడపాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కోరారు. మంగళవారం అమరావతిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గూడూరు నుంచి తిరుమలకు నేరుగా 14 బస్సు సర్వీసులు నడిస్తుండగా వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన శ్రీవారి భక్తులు గూడూరు రైల్వేస్టేషన్‌లో రైళ్లు దిగి తిరుమలకు వెళ్తుంటారని అన్నారు. గూడూరు నుంచి తిరుమలకు నేరుగా బస్సు సర్వీసులు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సులను తిరిగి పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయండి



మంత్రి నారాయణకు సమస్యలను వివరిస్తున్న కురుగొండ్ల

వెంకటగిరి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపాలిటీలో సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఖాళీలను భర్తీ చేసి పట్టణాభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరునారాయణను కోరారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం మంత్రిని ఎమ్మెల్యే కలిశారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికితీసుకెళ్లారు. మున్సిపల్ కమిషనర్ సెలవులో ఉండగా కార్యాలయంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం వల్ల పాలన స్తంభించిపోతోందన్నారు. మున్సిపాలిటీ ఏర్పడ్డప్పుడు నిర్మించిన తాగునీటి పైపు లైన్లు దెబ్బతినడంతో తరుచూ పట్టణంలో తాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని వివరించారు. కొత్త పైపులైను నిర్మాణానికి నిధులు ఇవ్వడంతో పాటు మున్సిపాలిటీలో ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు రూ.23 వేల జరిమానా

చిల్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి చిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పునిచ్చారు. 2021లో చిల్లకూరు మండలంలోని బూదనం గ్రామానికి చెందిన మస్తాన్‌బాబు ఓ బాలిక బహిర్భూకి వెళ్లిన సమయంలో అత్యాచారం చేశాడు. మస్తాన్‌బాబుపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.23వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

అధిక మోతాదులో మందులు పిచికారీ చేయొద్దు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వరిలో తెగుళ్లకు అధిక మోతాదులో రసాయన మందులు పిచికారీ చేయొద్దని మండల వ్యవసాయాధికారి భారతి సూచించారు. మండలంలోని వెస్ట్ వరత్తూరు, కల్లిమెట్టు గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుమందులు వినియోగాన్ని తగ్గించాలన్నారు. వీలైనంత వరకు సేంద్రియ ఎరువులు వినియోగించాలన్నారు. అనంతరం తెగులు సోకిన వరిని పరిశీలించి రైతులకు సలహాలిచ్చారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు.

ఇరకం విద్యార్థుల పడవలకు ఇంజన్ల వితరణ

తడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇరకం విద్యార్థులు ప్రయాణించే పడవలకు అవసరమైన ఇంజన్లను ఓ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా అందజేసింది. ఇరకం గ్రామస్థులు కొద్ది రోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలుసుకొని పడవల విషయంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. స్పందించిన కలెక్టర్ మత్స్యశాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లారు. మత్స్యశాఖ డీఈ నాగరాజు, ఓ స్వచ్ఛంద సంస్థకు తెలియజేసి రెండు పడవలకు నాలుగు మోటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మంగళవారం సుమారు రూ.1.57 లక్షల వ్యయంతో నాలుగు మోటర్లను ఇరకం గ్రామస్థులకు అందజేశారు.

పులికాట్ పూడికతీతకు బడ్జెట్ కేటాయింపు హర్షణీయం

తడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పులికాట్ పూడికతీతకు బడ్జెట్‌లో కేటాయింపు చేయడం హర్షణీయమని టీడీపీ మత్స్యకార నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మత్స్యకార నాయకుడు బొమ్మన శ్రీధర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు ముఖద్వారాలు పూడిపోయి మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నా గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇక పులికాట్ పునర్వైభవం సంతరించుకుని మత్స్యకారుల జీవితాలు మెరుగుపడు తాయన్నారు.

టెంకాయతోపు సమస్య పరిష్కారానికి కృషి

పెళ్లకూరు, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయతోపు వద్ద 71వ జాతీయ రహదారి ఎత్తులో ఉండడంతో పక్కనే ఉన్న టెంకాయతోపు గ్రామం లోతట్టు ప్రాంతంగా మారింది. వర్షం పడినప్పుడల్లా గ్రామస్థులు ఇక్కట్లు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం మొదలైనప్పటి నుంచి వర్షం పడితే చాలుగ్రామంలో నీరు నిల్వ చేరుతుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు టెంకాయతోపు గ్రామంలోకి నీరు చేరడంతో టీడీపీ నాయకులు పరిశీలించారు. దామెర ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ టెంకాయతోపు గ్రామంలో సిమెంటు రోడ్లు, డ్రైన్‌లు నిర్మించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నిధులు మంజూరు చేయించారని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

సమన్వయంతో పంచాయతీల అభివృద్ధి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న పరిశీలకుడు ప్రసాద్

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రమీలారాణి, ఎన్ఐఆర్‌డీ పరిశీలికులు ఏప్రసాద్, వీవోపీఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సాగరమాల నిర్వాసితులతో గ్రామసభ

కోట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నెల్లూరుపల్లి కొత్తపాళెం, ఊనుగుంటపాళెం పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం సాగరమాల భూ నిర్వాసితులతో గ్రామసభ జరిగింది. కోట, వాకాడు తహసీల్దార్లు జయజయరావు, రామయ్య, సర్వేయర్ గోపీరెడ్డి రైతులతో చర్చించారు. సాగరమాల రోడ్డు నిర్మాణంలో రైతులు ఎంత మేర భూములు కోల్పోయారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొంతమంది రైతులకు సంబంధించిన భూములు ఆన్‌లైన్‌లో తేడాలు వస్తుండటంతో పరిశీలించి అర్హులైన వారిని గుర్తించారు. సాగరమాల రోడ్డు పనులను అడ్డుకోవద్దని, అర్హులైన ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్లు చెప్పారు.

బెల్టు షాపుపై పోలీసుల దాడి

పెళ్లకూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టెంకాయతోపు గ్రామంలో బెల్టు షాపుపై మంగళవారం పోలీసులు దాడులు చేశారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మురళీని అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 8 బాటిళ్లను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

మునిరాజకు ఉత్తమ అధ్యాపక అవార్డు



సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న మునిరాజ

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం తిరువెంగలాయపల్లి గ్రామానికి డాక్టర్ మునిరాజ నెల్లూరులోని కేఏసీ జూనియర్ ప్రభుత్వ కళాశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. సోమవారం విజయవాడలో నిర్వహించిన జాతీయ విద్యాదినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖమంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఉత్తమ అధ్యాపకుడిగా అవార్డును అందుకున్నారు.

పరసాకు పరామర్శ

సూళ్లూరుపేట, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుండె శస్త్ర చికిత్స చేయించుకొని స్వగ్రామం గొట్టిప్రోలులో విశ్రాంతి తీసుకొంటున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంను మంగళవారం మాజీ ఎమ్మెల్సీ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి పరామర్శించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోటుపాళెం గ్రామం వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో స్థానిక శ్రీనివాస గిరిజన కాలనీకి చెందిన ప్రసాద్ మృతి చెందాడు. మంగళవారం గ్రామస్థులందరూ కలిసి ప్రసాద్ కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. నరేష్, కౌశిక్‌రెడ్డి, గాలి ప్రకాష్‌నాయుడు, నాగరాజు, కిషోర్, మధు పాల్గొన్నారు.

తెప్పపై అండాల్ అమ్మవారి దివ్యదర్శనం



నారాయణవనం, నవంబర్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మావతి దేవి సమేత కల్యాణ వెంకన్న ఆలయ కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పద్మ సరస్సులో తెప్పపై అండాల్ (గోదాదేవి) అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాత సేవ సహా నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం గోదాదేవికి స్నపన తిరుమంజనం నిర్వహించి, దూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం అర్చకులు అమ్మవారిని పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలతో అండాల్‌గా అలంకరించి తిరుచ్చి వాహనంపై అధిష్టింప జేసి మేళ తాళాలు, కోలాటాల మధ్య వేంచేపుగా పద్మసరస్సుకు చేరుకున్నారు. అనంతరం తెప్పపై అధిష్టింపజేసి పద్మ సరస్సులో తెప్పోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న అమ్మవారికి ఆస్థానం, ఏకాంత సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్ర మాలను టీటీడీ స్థానిక ఆలయాల ఏఈవో మోహన్, ఆలయాధికారులు నాగరాజు, భరత్, భద్రతా జమేదార్ మల్లికార్జున, ఏఈలు గురుప్రసాద్, నందిబాబు పర్యవేక్షించారు.

ముగిసిన భాగవత సప్తాహం



భాగవత బృందాన్ని సత్కరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆ ఆలయంలో చేపట్టిన భాగవత సప్తాహం మంగళవారం ముగిసింది. శ్రీసిటీ శ్రీవాణి సౌజన్యంతో భాగవత భక్త సమాజ సభ్యులు ఈనెల 6న భాగవత సప్తాహ మహోత్సవం ప్రారంభించారు. బయ్యపురెడ్డి ఎస్. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో 12మంది బృందం వారం రోజుల పాటు ఉదయం 6 నుంచి సాయంత్ర 6.30 గంటల వరకు భక్తిలశ్రద్ధలతో 12 స్కందాలతో కూడిన 335 అధ్యాయాలు, 18వేల భాగవత శ్లోకాల పఠనం మంగళవారం మధ్యాహ్నం పూర్తి చేశారు. భాగవత భక్త సమాజం బృందానికి శ్రీసిటీ ఎండీ రవీంద్రసన్నా రెడ్డి శాలువాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

రాచకండ్రిగలో పరిష్కారం కాని విద్యుత్ సమస్య

- 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కావాలని గ్రామస్తుల డిమాండ్
- 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తిప్పి పంపిన వైనం



వరదయ్యపాళెం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచకండ్రిగలో విద్యుత్ సమస్య పరిష్కారం కావడం లేదు. ఇటీవల గ్రామస్తులు లో వోల్టేజీ సమస్యతో తమ ఇళ్లలోని పరికరాలు కాలిపోతున్నాయని రోడ్డుపై బైఠాయించారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌కో అధికారులు 63 కేవీ ట్రాన్స్‌పార్మర్‌ను అమర్చడానికి తీసుకు రాగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తమకు 100 కేవీ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 63 కేవీ ఏర్పాటు సమస్య పరిష్కారం కాదంటున్నారు. చేసేది లేక ట్రాన్స్‌పార్మర్‌ను అధికారులు వెనక్కు తీసుకెళ్లారు.

ముగ్గురు శ్రీకాళహస్తివాసులకు వన్నెరెడ్డి కార్పొరేషన్‌లో చోటు

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్‌లో ముగ్గురు శ్రీకాళహస్తివాసులకు చోటు దక్కింది. టీడీపీ నాయకులు మిన్నల రవి, పి.చిన్నారెడ్డి, సుబ్రహ్మణ్యం చెర్లోపల్లి ఉన్నారు. వీరిని పలువురు అభినందించారు.

నెత్తురోడుతున్న జాతీయ రహదారి

నెలరోజుల్లో నాలుగు ప్రమాదాలు



కొత్తగా ప్రారంభమైన జాతీయ రహదారి

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆరు లేన్ల జాతీయ రహదారి నెత్తురోడుతోంది. నెలరోజుల వ్యవధిలోనే నాలుగు వరుస ప్రమాదాలు జరగడం కలవర పెడుతోంది. దీంతో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి రోడ్డు ప్రమాదాలకు మారుపేరుగా మారింది. పదేళ్ల నుంచి శ్రీకాళహస్తి సమీపంలో రోడ్డు ప్రమాదాలు జరగడం నిత్యకృత్యంగా మారింది. గత ఏడాది జూన్‌లో మిట్టకండ్రిగ వద్ద లారీని కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృతి చెందారు. ఈ తరహా భారీ ప్రమాదాలు వాహన చోదకులకు కంటిమీద కునుకులేకుండా చేశాయి. ప్రమాదాలను నివారించడానికి, ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం నాయుడుపేట నుంచి రేణిగుంట వరకు ఆరు లేన్ల జాతీయ రహదారి ఏర్పాటుకు కృషి చేసింది. అనంతరం భూ సర్వే పూర్తి చేశారు. మూడేళ్ల క్రితం రహదారి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. నెల రోజుల క్రితం శ్రీకాళహస్తి శివార్లలోని చెర్లోపల్లి నుంచి ఊరందూరు మీదుగా పెద్దకన్నలి వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి. పాత రహదారిపై రోడ్డు ప్రమాదాలతో భయం భయంగా గడిపిన ప్రజలు కొత్త రహదారి ప్రారంభంతో సంతోషం వ్యక్తం చేశారు. ఇక రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడుతాయని భావించారు. అయితే నెలరోజుల వ్యవధిలోనే నాలుగు వరుస ఘటనలు అధికారులకు హెచ్చరికలు జారీ చేశాయి.

సంబంధిత అధికారులు ప్రమాదాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. జాతీయ రహదారిపై కొంత ప్రత్యేక దృష్టి సారించి గుర్తు తెలియని వాహనాలు ఢీకొట్టి పరారయ్యే హిట్ అండ్ ఘటనలను వెంటనే గుర్తించే విధంగా నిఘా వ్యవస్థను పటిష్ఠం చేయల్సి ఉంది.

నాలుగు ప్రమాదాలు...



కన్నలి వద్ద ఆపి ఉన్న పోలీసు వాహనంపైకి గ్యాస్ సిలిండర్ల లారీ దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఫారెస్టు వాచర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆ తరువాత ఇటీవల ఊరందూరుఫ్లైఓవర్ వద్ద ఓ లారీ బ్రేక్‌ఫెయిల్ కావడంతో రోడ్డుపక్కన ఉంచారు. బాపట్లకు చెందిన స్టోన్ క్రషర్ వ్యాపారి కారు లారీని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అదే రోజు తిరుచానూరుకు చెందిన ఆటోను ఊరందూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఇక సోమవారం మళ్లీ కన్నలి వద్ద ద్విచక్ర వాహనదారుడిని గుర్తు తెలియన వాహనం ఢీకొట్టడంతో సుబ్బరాయులు అనే యువకుడు అక్కడిక్కకడే మృతి చెందాడు. నాలుగు దుర్ఘటనల్లో నలుగురు మృతి చెందడం గమనార్హం.

రికార్డులు స్వాధీనపరచని కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

- రేణిగుంట పంచాయతీలో నిధుల అవకతవకలపై త్రీమెన్ కమిటీ: డీపీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



అధికారులను నిలదీస్తున్న డీపీవో సుశీలాదేవి

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మేజర్ పంచాయతీలో నిధులు అవకతవకలపై డీఎల్‌పీవో ఆధ్వర్యంలో విచారణ జరిపి నివేదిక అందించడంలో జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేసిన డీపీవో ఎట్టకేలకు త్రీమెన్ కమిటీని నియమించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన 'తేలని లెక్క రూ.6కోట్లు - ఇంకా బాధ్యతలు అప్పగించని బదిలీ కార్యదర్శులు' అనే కథనానికి జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి స్పందించారు. మంగళవారం రేణిగుంట పంచాయతీ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పంచాయతీలో పారిశుధ్య పనుల లోపంపై ఈవోపీఆర్డీ ప్రభురావు, కార్యదర్శి మణి, ఇన్‌స్పెక్టగర్ రవిపై మండిపడ్డారు. అనంతరం డీపీవో సుశీలాదేవి మాట్లాడుతూ... ఇక్కడి నుంచి బదిలీ అయి, ఇప్పటి వరకు రికార్డులు అందజేయని ఆరుగురు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు పంపిస్తున్నామన్నారు. గతంలో సుబ్బరాజు బోరు, 2022లో పంచాయతీలో జరిగిన నిధులు అవకతవకలపై డీఎల్‌పీవో ప్రభురెడ్డిని విచారణ అధికారిగా వేసినా నివేదికలు అందించడంలో జాప్యం జరుగుతుండటంతో త్రీమెన్ కమిటీని నియమించినట్టు తెలిపారు. త్రీమెన్ కమిటీ విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తే పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేయడమే కాకుండా ఆయా పంచాయతీల్లో సర్పంచుల చెక్ పవర్ రద్దయ్యే అవకాశం ఉంది.

సంక్షిప్తంగా..

కలెక్టర్‌ను కలిసిన ముక్కంటి ఆలయ ఈవో



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇటీవల ముక్కంటి ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన బాపిరెడ్డి మంగళవారం ఉదయం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌కు ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. అదే విధంగా మొక్కను కూడా అందజేశారు.

ముక్కంటి పాలకమండలి సభ్యుడిగా అవకాశం కల్పించండి



శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలిలో సభ్యుడిగా అవకాశం కల్పించాలని బొడుగు మునిరాజాయాదవ్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు అమరావతిలో ఎమ్మెలను మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేరం ధనంజయులునాయుడు, కందాటి శివశంకర్ రెడ్డి, రంగినేని చెంచయ్యనాయుడు, పాపిరెడ్డి, కన్నలి మోహన్‌రెడ్డి, కేశినేని సుబ్రహ్మణ్యం, దేవినాయుడు, జగదీష్‌నాయుడు, ఉమాపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బంకుపెట్టిన వారికి నోటీసులిస్తాం

రేణిగుంట, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): అనధికారికంగా రాత్రికి రాత్రి ఆర్‌అండ్ బీ రోడ్డు పక్కన ప్రభుత్వ స్థలంలో బంకు పెట్టిన వారికి నోటీసులు ఇస్తామని పంచాయతీ కార్యదర్శి మణి చెప్పారు. బంకును ఏర్పాటుపై ఆంధ్రజ్యోతి దినపత్రిలో ఇటీవల వార్త ప్రచురించమైంది. స్పందించిన పంచాయతీ కార్యదర్శి మంగళవారం రేణిగుంట - తిరుపతి ప్రధాన రోడ్డు మార్గంలోని రైల్వే ఆస్పత్రి ఎదురుగా బంకును పరిశీలించారు. పోలీసులకు ఫిర్యాదు చేసి బంకును ఇక్కడి నుంచి తొలగిస్తామన్నారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

కేవీబీపురం, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయితీ వేరుశనగ విత్తనాలను ఎంపీడీవో కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుతానికి కే6, టీసీజీఎస్ 1694 రకాల విత్తనాలు మండలానికి చేరాయని చెప్పారు. వాటిని ఆయా పంచాయతీల్లోని సచివాలయాల్లో, రైతు సేవాల కేంద్రాల వద్ద పంపిణీ చేస్తున్నామన్నారు. 30 కిలోల బస్తాకు రూ.1,730 చెల్లించి పొందవచ్చన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో విత్తనాల కోసం రైతులు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మేలు రకం విత్తనాలను అవసరం మేరకు పంపిణీ చేస్తామన్నారు. తిరుపతి పార్లమెంటు తెలుగురైతు అధ్యక్షుడు గోపినాథ రెడ్డి, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామియాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు మునిశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమానికి రూ.7,557 కోట్లు కేటాయించడం హర్షణీయం

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో గిరిజన సంక్షేమానికి రూ.7,557 కోట్లు కేటాయించడం హర్షణీయమని ఎస్టీసెల్ తిరుపతి జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు సుబ్బయ్య అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గత వైసీపీప్రభుత్వం గిరిజనులను పట్టించుకోలేన్నారు.

రాష్ట్ర పదవుల్లో ముస్లిం మైనార్టీలకు పెద్దపీట

శ్రీకాళహస్తి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పదవుల్లో ముస్లిం మైనార్టీలకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీరాలీ అన్నారు. ప్రభుత్వ మైనార్టీ సలహాదారుగా ఎం.ఏ.షరీఫ్, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా మౌలానా ముస్తాక్ అహ్మద్‌ను నియమించడం సంతోషకరమన్నారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్‌లో మైనార్టీ సంక్షేమం కోసం రూ.4,376కోట్లు కేటాయించడం హర్షణీయమన్నారు. మైనార్టీలపై కూటమి ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేడాంలోని దక్షిణ కాళికాదేవి ఆలయంలో మంగళవారం మధ్యాహ్నం రాహుకాల సమయంలో మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. తీర్థప్రసాద వినియోగంతో పాటూ మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

ఆంజనేయ స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని పదహారు కాళ్ల మండపంలో కొలువై ఉన్న ఆంజనేయుడికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు వివిధ పూజా ద్రవ్యాలతో అభిషేకించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం సిందూరం దిద్దారు. భక్తులు తమలపాకుల మాలలు సమర్పించారు

కాలభైరవుడి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాలభైరవుడకి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు కాలభైరవుడికి అభిషేకాలు నిర్వహించి ధూప, దీప, నైవేద్య హారతులు సమర్పించారు. ఉత్సవమూర్తిని అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు ఊరేగించి తిరిగి ఆల యంలో కొలువు తీర్చారు.